గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# డిసెంబర్2017
# కథలు




నా పేరు ఝాన్సీ. ఒక ప్రభుత్వ కళాశాలలో ఉద్యోగం. ఐదు అంకెల జీతం. యూనివర్సిటీలో ఉన్నప్పుడు జగదీష్ కి దగ్గరయ్యాను. ఆ వయసులో కలిగే భావనలని ప్రేమ అనుకున్నాను. ఇష్టమైన వ్యక్తిని పెళ్లి చేసుకోవాలని ఆశపడ్డాను. చిన్నప్పటి నుంచి నాకు కాస్త ధైర్యం ఎక్కువ అని అందరూ అంటుంటారు. నాన్న కూడా నేను ఏ విషయానికీ భయపడకూడదనీ, ధైర్యంగా ముందుకు వెళ్లాలని ఆడపిల్లను      కదా అని వెనుకడుగు ఎప్పుడూ వేయకని చెప్తుండేవారు. నాన్న ఇచ్చిన ఆ ధైర్యంతోనే జగదీష్ ని నాన్న ముందుకు తీసుకెళ్లాను. ఏమంటాడో అనే భయం లేదు. ఎందుకంటే నాన్న నాకు అన్నీ ఇచ్చాడు. భయం తప్ప. అయినా చాలా మంది అబ్బాయిలు, అమ్మాయిలు చేసే పని నేను చేయలేదు. ఇంట్లో పారిపోయి దొంగతనంగా పెళ్లిచేసుకోవడం. పెద్దవాళ్ళ పరువు తీయడం. నా మీద నాకు నమ్మకం. నాన్న మీద అంతకన్నా ఎక్కువ నమ్మకం. అందుకే జగదీష్ ని నాన్నకు దగ్గరగా తీసుకొచ్చాను. జగదీష్ తో మాట్లాడిన నాన్న, కళ్ళతోనే మౌనంగా      సంతృప్తి వ్యక్తం చేశాడు.

అమ్మే కాస్త సతాయించింది. మన కులం ఏమిటి? గోత్రం ఏమిటి? ఆ అబ్బాయి కులం ఏమిటి?      గోత్రం ఏమిటి? అందుకే ఆడపిల్లని చదివించొద్దు పది పాసయ్యాక పెళ్లిచేసేద్దాం అన్నాను. మీరు నా మాట వింటేనా? ఇప్పుడేం చేస్తారో చెయ్యండి. ఎంతైనా అయ్యాకూతుర్లు ఇద్దరూ ఒకటేగా! నా మాట ఎక్కడ నెగ్గింది. అంటూనే .... ఏమిటబ్బాయ్ "కట్నకానుకలు ఏ మాత్రం కావాలి" అని జగదీష్ ని అడిగేసింది. సెకన్ కూడా గ్యాప్ లేకుండా జగదీష్ వెంటనే సమాధానం చెప్పాడు. అమ్మ ఫిదా అయిపోయింది. ఇంతకీ జగదీష్ చెప్పిన సమాధానం ఏమిటో తెలుసా?"మీ అమ్మాయినే కట్నంగా ఇవ్వండి అత్తయ్యా పువ్వుల పొట్లంలో పెట్టి చూసుకుంటాను".

****

జగదీష్ ఎప్పుడు ఖాళీ దొరికినా తన క్లాస్ నుంచి నా క్లాస్ కి వచ్చేసేవాడు నన్ను చూడటానికి, నాతో మాట్లాడ టానికి. క్లాస్ జరగకపోతే చాలు వెంటనే క్యాంటిన్ కి వెళ్లిపోయేవాళ్లం. టీ తాగుతూ గంటల తరబడి మాట్లాడుకునే వాళ్ళం. సినిమాకి, షికార్లకీ అస్సలు టైమ్ తెలిసేది కాదు. యుగాలు క్షణాల్లా గడిచిపోయేవి. ఎన్నెన్ని మాటలు చెప్పేవాడో ... "నా జీవితమనే పుస్తకంలో ప్రతి పేజీలో నువ్వున్నావు... నేను రాసే ప్రతి అక్షరంలో నువ్వే నిండిపోయి ఉన్నావు" ఇలా ఒకటా రెండా ఎన్ని మాటలు చెప్పేవాడో... "నీ ప్రేమ నాకు దక్కదని నేను బాధపడటం లేదు. నాలో ఉన్న అనంతమైన ప్రేమ నువ్వు పొందలేకపోతున్నందుకే నాబాధ ప్రియా!!!" ఎక్కడో విన్నాను అయినా నాకోసం చెప్పినందుకు అనిర్వచనీయమైన ఆనందానికిలోనై జగదీష్ ని ప్రేమించాను. "కనుల దాటిన కన్నీరు కాసేపటికి ఆగును.... నన్ను దాటిన నా ప్రేమ ఏదో ఒక నాటికి నీ దరి చేరును" అని వాడు చెప్పిన మాటలు అక్షరాలా నిజం. ఒక్కో సారి అనిపిస్తుంది. నిజంగా వాడిని ప్రేమించకపోతే సముద్రమంత ప్రేమను కోల్పోయేదానినేమో... "ప్రేమలో ఉన్న వాళ్ళకి ప్రపంచంతో పని ఉండదట. ఎందుకంటే ప్రేమే వాళ్ళ ప్రపంచం." అది వాడి సాహచర్యంలో నిజమనిపించింది. పెళ్ళికి ముందు.

*****

ఇప్పుడు... జీవితం నాశనమయ్యిందేమో అనిపిస్తుంది. నాన్న ఇచ్చిన ధైర్యం నన్ను ఇలా చేసిందా? అనిపిస్తుంది. ఎందుకింత పిరికిదానిలా మారిపోయాను. నా అస్తిత్వాన్ని నేను ఎందుకు కోల్పోయాను. అసలు నేను ఎవరిని ఝాన్సీ నేనా? లేక ఇంకెవరినైనా... నేను ఎవరు అనే ప్రశ్న వేసుకోవలసిన ఈ పరిస్తితి ఏమిటి!?

ఆయన చాలా మారిపోయారు. పెళ్ళికి ముందులా పెళ్లయ్యాక లేరు. సినిమాలు, షికార్లు తరువాత సంగతి కనీసం ఖాళీ టైమ్ లో పక్కన కూర్చుని ప్రేమగా మాట్లాడిన సందర్భాలు కూడా లేవు. పెళ్లికి ముందు ప్రేమకు నిలువెత్తు నిదర్శనంలా కనిపించాడు. ఇప్పుడు పాషాణ హృదయానికి పరాకాష్టలా ఉన్నాడు. ఎందుకింత మార్పు అని అడిగితే ఉద్యోగం, బరువులు, బాధ్యతలు అంటాడు. ఒక్కన్ని తెస్తే అందరూ కూర్చుని తినే వాళ్ళే అంటాడు. నాకుండే టెన్షన్స్ నాకున్నాయి నన్ను ఇబ్బంది పెట్టకు అని వీలైనంత దూరంగా వెళ్లిపోతాడు. నాలో నేను ఎంత మదనపడ్డానో ఆయనకేం తెలుసు. అప్పుడు నాకు ఆరోనేల. ఈ సమయంలో భర్త పక్కన ఉంటే బావుండని ఏ స్త్రీ అయినా కోరుకుంటుంది. నేనూ... అదే కోరుకున్నాను. పెళ్ళికి ముందు అడగకుండానే అన్నీ నా కాళ్ళ దగ్గరికి తెచ్చిన వ్యక్తి ఈ రోజు అడిగినా కంటికి కనిపించనంతగా మారిపోయాడు. అత్త, మామ, భర్త అందరూ ఉండి నేను అనాథనయ్యాను. ఒంటరి జీవితమైపోయింది.

*****

జగదీష్ తో పెళ్ళికి మాయింట్లో ఎలాంటి ఆంక్షలు లేవు. కానీ నన్ను పెళ్లి చేసుకోవాలంటే మాత్రం వాళ్ళ ఇంట్లో ఒకే ఒక ఆంక్ష పెట్టారు. అదే నా జీవితాన్ని ఇలా మార్చేస్తుందని అనుకోలేదు. నన్ను జగదీష్ పెళ్లి చేసుకుంటే మా అమ్మ, నాన్న తో సంబంధాలు ఉండకూడదు. నేను పుట్టింటికి వెళ్లకూడదు. వాళ్ళు నా దగ్గరికి రాకూడదు. మా వాళ్ళు సరే అన్నారు. ఇష్టమైన వ్యక్తిని పెళ్లి చేసుకో నిదానంగా వాళ్ళే మారతారు. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా! అని చాలా సునాయాసంగా నవ్వుతూ ఒప్పేసుకున్నారు. అదేంటి నాన్నా అంటే 'ఆడపిల్ల ఎప్పటికైనా ఆడపిల్లే' అని చేతులు దులిపేసుకున్నారు. అంతలా ఆలోచించే నాన్న ఎందుకిలా...!? ఆరోజే నాన్న ఈ సంబంధం వద్దురా తల్లీ! అత్తామామలు సరే, ప్రేమించినవాడు నిమ్మకు నీరెత్తినట్లు మౌనంగా ఉన్నాడు... అవసరమా     అని ఉంటే జగదీష్ తో నా పెళ్లి అయ్యి ఉండేది కాదు. అయినా నాన్నని ఎందుకు అనడం. నన్ను నేనే తిట్టుకోవాలి. కండిషన్ పెట్టినప్పుడు అసలు నేను ఎందుకు ఒప్పుకున్నాను. నేను ఒప్పుకోకుండా ఉంటే...అంటే జగదీష్ మీద ఉన్న ప్రేమ నా చేత ఆరోజు మాట్లాడించలేదు. అందుకే ఆ తరువాత చాలా     అనుభవించాను. ఘనీభవించాను.

నెలలు నిండుతున్నా ఇంట్లో పనులన్నీ నేనే చేయాలి. కడుపు నిండా తిండి కరువైంది. కంటి నిండా నిద్ర కరువైంది. మనసు నిండా ప్రేమ కరువైంది. అదే అమ్మ, పక్కన ఉంటే ఇన్ని పనులు నా చేత చేయించేదా? "గర్భంతో ఉన్న స్త్రీ గర్భ గుడిలో దేవత" అన్నారు. నేను దేవతని కాను. ఎందుకంటే గర్భ గుడిలో దేవత ఎప్పుడూ కూర్చొనే ఉంటుంది. నేను ఎప్పుడూ అటుయిటూ తిరుగుతూ గంపెడు పనులని నెత్తిన వేసుకొని, గంపెడంత కడుపుని ముందేసు కుని తిరుగుతూ ఉంటాను. చుట్టు పక్కల వాళ్ళు అందరూ నన్ను చూసి తెగ మెచ్చుకునేవారు. "రేపో మాపో కనేలా ఉంది. అయినా ఎంత ఓపిగ్గా పనులు చేసుకుంటుందో.... కోడలంటే అలా ఉండాలని" కూతురు మాత్రం ఇలా ఉండకూ డదు. సమసమాజం సమసమాజం అని చర్చలు, ఉపన్యాసాలు ఇస్తాం కానీ అత్త కోడళ్ళ మధ్య సమైాధ్య ఉన్నప్పుడే నిజమైన సమసమాజం వస్తుందని నాకనిపించింది.

పెద్ద వయసు వాళ్ళు, అమ్మలక్కలు అందరూ అనేవారు ఇంత చలాకీగా ఉన్నావు నువ్వు ఖచ్చితంగా అబ్బాయినే కంటావని. నేను అదే కావాలనుకున్నాను. భగవంతుడా "అమ్మాయిని మాత్రం ఇవ్వకు. రేపు అది కూడా నాలానే ఇలా ఇబ్బందులు పడటం నాకిష్టం లేదు. అణిగిపోయి,అస్తిత్వాన్ని కోల్పోయి ఉండే అమ్మాయి కంటే ఆధిపత్యాన్ని చలాయించే అబ్బాయినే ఇవ్వు." ఒక వేళ అమ్మాయి పుడితే...ఎంత ధైర్యంగా పెంచినా తను కూడా నాలా ఆలోచనా రహితంగా నిర్ణయాలు తీసుకుంటే....వద్దు దేవుడా! వద్దు నాకు అమ్మాయి వద్దు. అబ్బాయినే ఇవ్వు. అయినా మన చేతులో ఏముంది. నాలో నేను పిచ్చిదానిలా అనుకుంటూ ఏదో ఆలోచిస్తూ అలా వంట గదిలో అడుగుపెట్టాను. కడుపంతా ఒకటే నొప్పి. అత్తయ్యగారూ అని పిలిచాను.. ఆవిడ పరిగెత్తుకుంటూ వచ్చింది. నొప్పులు మొదలయ్యాయి అనే అనుమానంతో వెంటనే పక్కింటి వాళ్ళను పిలిచి విషయ నిర్ధారణ చేసుకున్నాక ఆటో పిలిపించి హాస్పిటల్ కి తీసుకెళ్లింది. నొప్పులు చాలా ఎక్కువగా ఉన్నాయి. తట్టుకోలేకపోతున్నాను. ఆఫీస్ నుంచి ఆయన కూడా వచ్చారు. అత్తయ్య, ఆయన డాక్టర్ తో మాట్లాతున్నారు. ఏం మాట్లాడుతున్నారో నాకు తెలియదు. తరువాత డాక్టర్ సిస్టర్స్ తో మాట్లాడడం చూశాను. సిస్టర్స్     వచ్చి నాకు సెలైన్ పెట్టి ఇంజక్షన్ చేసి వెళ్లారు. ఆ తరువాత ఏం జరిగిందో తెలియదు. నాకు మెలకువ వచ్చే సరికి నా పక్కన పాప. పొట్ట అంతా నొప్పిగా ఉంది. కదలలేని పరిస్థితి. ఎటు కదిలినా ప్రేగులు బయటకి వచ్చేలా భావన. పొట్టమీద నిదానంగా చేయిపెట్టి చూసుకున్నాను. జానెడు పొడవున దోసకాయను కోసినట్టు కోసి, వడ్ల బస్తాకి కుట్లు వేసినట్టుగా నా పొట్ట... అప్పుడనిపించింది నేను వచ్చింది హాస్పిటల్ కి కాదు కోతమిల్లుకని.

*****

నాలుగేళ్లు గడిచిపోయాయి. ఈ నాలుగేళ్ళలో అమ్మానాన్నలతో ఎలాంటి సంబంధాలు లేవు. తెలిసిన వాళ్ళ ద్వారా బావున్నారని వినడమే కాని, కళ్ళతో చూసింది లేదు. చదువుకునే రోజుల్లో కూడా అమ్మానాన్నలను వదిలేసి ఉండాల్సి వస్తుందని హాస్టల్ లో ఉండటానికి కూడా ఇష్టపడని నేను, ఒక్కరోజు కూడా అమ్మనాన్నలను చూడకుండా ఉండని నేను మూడేళ్లు… మూడేళ్లు ఎలా ఉండగలిగాను. పెళ్ళంటే ఇదేనా? నా అన్న వాళ్ళకు నన్ను దూరం చేయడమే పెళ్ళా? ఆయన మాత్రం పుట్టిన దగ్గరనుంచి ఇప్పటి వరకు వాళ్ళ అమ్మనాన్నలతోనే… ఆయనకులాగానే నాకు కూడా ప్రేమలు, అభిమానాలు ఉంటాయని ఎందుకు ఆలోచించరు. ప్రేమ పెళ్ళిళ్ళల్లో పెళ్ళికి ముందేనా ప్రేమ ఉండేది. ఇన్ని ఆలోచనల మధ్య మరో కొత్త ఆలోచన నన్ను నిద్రలేకుండా చేస్తుంది. భయం భయంగా బ్రతకాల్సి వస్తుంది. 'నక్షత్ర'కి నాలుగేళ్ళు దాటుతున్నా ఇంకా మాటలు రావడం లేదు. లోపల తెలియని భయం. ఎవరికి చెప్పినా వస్తాయిలే… కంగారేముంది… అప్పుడే మాట్లాడి ఏం చేస్తుందిలే… ఈ కాలం పిల్లలు పెద్దలకు ఎదురు సమాధానం చెప్పడం తప్ప అని కొందరు… అనే వాళ్ళే తప్ప సలహాలు, సూచనలు ఇచ్చే వాళ్లే లేరు. ఎవరు ఎన్ని అన్నా నా బిడ్డ ముద్దు ముద్దు మాటలు విని తరించాలని నాకు ఉండదా?

*****

ఆటో దిగి పాపను ఒక చేత్తో పట్టుకొని, నాన్న చదివించిన చదువులకు సాక్ష్యమైన సర్టిఫికెట్స్ ఫైల్ ఒక చేత్తో పట్టుకుని ఏం జరిగినా ఫరవాలేదు అనే ధైర్యంతో గేటు తీసుకొని వెళ్ళి కాలింగ్ బెల్ కొట్టాను. ఎవరూ తలుపు తీయలేదు. మళ్ళీ కొట్టాను… ఈసారి కూడా ఎవరూ తీయలేదు… మళ్ళీ కాలింగ్ బెల్ కొట్టబోతుంటే డోర్ గడియ తీసిన చప్పుడు… ఆగాను… నాన్న …!!! ఎవరండీ అంటూ తలెత్తి… అలానే … ఆశ్చర్యంగా ఝాన్సీ… నువ్వా! "ఏమోయ్ ఎవరొచ్చారో చూడు" అంటూ భార్య గాయత్రిని పిలిచాడు. సత్యమూర్తి. "ఎవరండీ…" అంటూ వస్తూ వస్తూనే ఝాన్సీని చూసిన గాయత్రి కుప్పకూలిపోయింది. వెళ్ళి కాసిన్ని నీళ్ళు ముఖాన కొట్టి నిదానంగా లేపారు. నాలుగేళ్ళ తరువాత కూతుర్ని చూసిన తల్లి విలవిలలాడిపోయింది. కాసేపటికి కానీ తేరుకొని "నా మానవరాలా? తల్లీ" అంటూ పాపను దగ్గరికి తీసుకొని ముద్దు చేసింది. అప్పటికే ఝాన్సీ వచ్చి రెండు, మూడు గంటలు దాటింది. ఎవరూ జగదీష్ గురించి అడగడం లేదు. ఝాన్సీ కల్పించుకుని "ఏంటి నాన్నా, ఎవరూ మీ అల్లుడి గురించి అడగడం లేదు"… ఝాన్సీ మాట పూర్తి కాకుండానే సత్యమూర్తి "యోగ క్షేమాలు అడిగేంత గొప్పవాడు కాదులేమ్మా! మీ ఆయన. నాలుగేళ్లపాటు నువ్వు మమ్మల్ని చూడటానికి ఏనాడూ రాలేదు. మేము నిన్ను చూసే అవకాశం, అదృష్టం కూడా ఏనాడూ రాలేదు. దీనికి కారణం మీ ఆయనే కదమ్మా! అంత ఉత్తమమైన అల్లుడి గురించి … సారీ, జగదీష్ గురించి అడగాల్సిన అవసరం లేదు. ఆరేళ్ళ తరువాత ఇప్పుడు నువ్వు పుట్టిల్లు వెతుక్కుంటూ ధైర్యంగా వచ్చావంటే అర్థం చేసుకోలేనంత అమాయకుడిని కాదులేరా, జానూ!. వాడితో తెగతెంపులు చేసుకొని వచ్చి ఉంటావు. లేదా, వాడే నీతో బంధాన్ని తెంపేసుకుని ఇంట్లో నుంచి బయటకు పంపి ఉంటాడు. ఈ రెండిటిలో ఏది జరిగినా ఒక మూర్ఖున్ని, ప్రేమ పేరుతో వంచించిన వాడిని, భార్యని గౌరవించని వాడిని నువ్వు వదిలేసి రావడానికి నాలుగేళ్లు పట్టిందన్న మాట. నేను పంచిన రక్తం, నూరిపోసిన ధైర్యం, చదివించిన

చదువులు ఇవి నిన్ను నాలుగేళ్లు పిరికిదానిలా ఉంచాయా? మీ సహనం, మీ నిర్లక్ష్యం మిమ్మల్ని ఇలా భర్త చాటు భార్యల్లా తయారు చేస్తూనే ఉంటాయి. నువ్వు కట్టుబట్టలతో, ఒకచేత్తో పాపని, ఒక చేత్తో నీకు దారి చూపించే సర్టిఫికెట్స్ ని తీసుకొని వచ్చినప్పుడే అనుకున్నాను. ఇక నీ కాళ్ళ మీద నువ్వు నిలబడగలవని" నాన్న మాట్లాడుతుంటే నేను ఏడుస్తూనే ఉండిపోయాను. అమ్మ వచ్చి కన్నీళ్లు తుడిచి… "ఇప్పుడేమయ్యిందని ఆ ఏడుపు, సంతోషాన్ని వెదుక్కుంటూ నాలుగు గోడల మధ్య నుంచి నాలుగు దిక్కుల మధ్యలోకి వచ్చావు. ఇక అంతా మంచే జరుగుతుంది." అంటూ "అమ్మ, అవును ఝాన్సీ నీ కూతురు ఏంటే వచ్చిన దగ్గర్నుంచి ఏం మాట్లాడకుండా మూగ మొద్దులా కూర్చుంది."

*****

"యావండీ…"; "ఆ …చెప్పు"

"ఈ రోజు హాస్పిటల్ కివెళ్లాలి" ; "ఎందుకు…"

"పాప చెకప్ కి"; "ఏమయ్యింది దానికి"

"ఏమవ్వడమేమిటండీ ఇప్పుడు దానికి నాలుగో ఏడు …" ; "అయితే…."

"అయితే ఏమిటండీ … అది మాట్లాడటం లేదు… పిలిచినా పలకడం లేదు… నాకు భయంగా ఉంది. ఈ రోజు ఎలాగైనా సరే హాస్పిటల్ కి పాపను తీసుకెళ్ళాల్సిందే."

"నాకు కుదరదు. చాలా పనులున్నాయి."

"పాపకంటేనా….!!!!"

"ఈ సోది మాటలు ఆపు. డబ్బులిస్తాను, క్రెడిట్ కార్డు ఇస్తాను. నువ్వే వెళ్ళి చెకప్ చేయించుకురా…"

ఆయన ప్రవర్తనకు చేసేది ఏమీ లేక పాపని తీసుకొని హాస్పిటల్ కి వెళ్ళాను. డాక్టర్ నిరంజన్ చాలా పేరున్న డాక్టర్. పిల్లల్ని ఎలా ట్రీట్ చేయాలో ఆయనకి బాగా తెలుసని అందరూ అంటుంటే ఆయన దగ్గరకే తీసుకెళ్లాను. టెస్ట్ లు చేసిన తరువాత ఎక్కువ సమయం నాకోసం కేటాయించారు. నన్ను చాలా ప్రశ్నలు అడిగారు. కొన్నిటికి సమాధానం చెప్పాను. కొన్నిటికి చెప్పలేక పోయాను. కొన్నిటికి తెలిసి కూడా మౌనం వహించాను. డాక్టర్ దగ్గర ఏమీ దాచకూడద నడంతో దాదాపుగా ఆయన అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పాను. చివరిగా ఆయన 'పాపకు వినపడకపోవడం వల్ల మాట్లాడటం లేద' ని చెప్పారు. అంటే పాప 'డెఫ్ అండ్ డమ్'. డాక్టర్ ని ఎందుకిలా జరిగిందని కారణం అడిగితే ఆయన అడిగిన ప్రశ్నలలోంచి నాకు సమాధానాన్నిచ్చారు.

డాక్టర్ అడిగిన ప్రశ్నలలో మూడు ప్రధానమైన ప్రశ్నలు.

"మీది మేనరికమా?; మీ భర్త మీ పట్ల ఎలా వ్యవహరిస్తారు.?; మీరు గర్భంతో ఉన్నపుడు ఎక్కువగా ఫోన్ వాడేవారా?

మీకు డెలివరీ ప్రోపర్ గా జరిగిందా?"

"మేనరికం కాదన్నాను. భర్త సరిగా చూసుకోడన్నాను, కడుపుతో ఉన్నప్పుడు అయిదవనెలవరకు ఆయన నాతో ఎక్కువగా ఫోన్లో మాట్లాడేవారని చెప్పాను. డెలివరీ విషయంలో అనుమానం వ్యక్తం చేశాను."


కడుపుతో ఉన్నప్పుడు ఎక్కువగా ఫోన్లో మాట్లాడటం వలన లోపల ఉన్న బేబీస్ రేడియేషన్ కి గురై అబ్'నార్మల్ గా పుట్టటానికి అవకాశం ఉంది. అంతేకాకుండా మీ భర్త సరిగా చూసుకోక పోవడం వలన మీరు ఎక్కువగా డిప్రెషన్ కి గురయి ఉండొచ్చు దాని వలన కూడా అసాధారణ ప్రవర్తన కలిగిన పిల్లలు పుట్టడానికి అవకాశం ఉంది. అంతేకాకుండా డెలివరీ అయ్యేటప్పుడు జరిగే కొన్ని తప్పిదాల వల్ల కూడా పిల్లల ప్రవర్తనలో మార్పు రావచ్చు. ఇవి పుట్టిన వెంటనే బయటపడతాయని చెప్పలేం. బిడ్డ ఎదుగుతున్న క్రమంలో ఇవి బయటపడే అవకాశాలు చాలా ఎక్కువ" డాక్టర్ చెప్పిన మాటలు విని మందులు తీసుకొని, నాకు డెలివరీ అయిన హాస్పిటల్ కి వెళ్ళి పాప కండిషన్ వివరించి డాక్టర్ ని డెలివరీకి వచ్చిన రోజు మాఆయన, అత్త గార్లు ఏం మాట్లాడారో చెప్పమని అర్థించాను. ఫలితం శూన్యం. ఇదంతా విన్న సిస్టర్ "ఆరోజు అమావాస్య అని ఇంకో రెండు మూడు గంటల్లో అమావాస్య ఘడియలు వెళ్లిపోతాయని కాబట్టి ఎలాగైనా సరే రెండు మూడు గంటల వరకు డెలివరీ కాకుండా ఆపమని మీ అత్తగారు డాక్టర్ కి డబ్బు ఎర చూపడంతో నార్మల్ డెలివరీ అవడానికి 99% అవకాశం ఉన్న మీకు నొప్పుల్ని కాస్త కంట్రోల్ చేసి డ్రౌజి లెవల్ కి తీసుకెళ్లి అమావాస్య ఘడియలు దాటిన తరువాత ఆపరేషన్ చేసి పాపని బయటికి తీశారు." అని చెప్పడంతో నా గుండె పగిలినంత పనయ్యింది.

ఇంటికి వెళ్లిన నేను పాపకు కాస్త అన్నం పెట్టి, నేను కూడా కడుపునిండా తిని ప్రశాంతంగా కూర్చున్నాను ఇంట్లో ఎవరూ అడగలేదు పాపని చెక్ చేసి డాక్టర్ ఏమన్నాడని. సాయంత్రం అయ్యింది. జగదీష్ ఇంటికి వచ్చాడు. జగదీష్ కూడా పాప గురించి ఏమి అడగలేదు. ఒక చేత్తో పాపను పట్టుకుని, ఇంకో చేత్తో సర్టిఫికెట్స్ ఫైల్ పట్టుకుని నేను నాపుట్టింటికి వెళుతున్నాను. బహుశా ఇక తిరిగిరాకపోవచ్చు అని అందరికీ వినిపించేలా చెప్పాను. అక్కడ మూడో ప్రపంచ యుద్ధమే జరిగింది. ఈ గొడవను చూస్తూ పాప నోట్లో నుంచి నురగలు కక్కుకుంటూ పడిపోయింది. వెంటనే అంబులెన్స్ పిలిపించి పాపను హాస్పటల్ కి తీసుకెళ్ళాం. డాక్టర్ నిరంజన్ పాపని రెండు రోజులు అబ్జర్వేషన్ లో ఉంచి "తనలో మానసికంగా కూడా ఎదుగుదల లేదు. తనని మీతో పాటే ఉంచితే చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. పాపకు కూడా అది మంచిది కాదు. వీరి కోసం ఏర్పాటు చేయబడిన ప్రత్యేకమైన రిహాబిలిటేషన్ సెంటర్స్ లో ఉంచడం వలన కొంతవరకు ఫలితాన్ని పొందడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటినుంచైనా జాగ్రత్తగా మందులు వాడుతూ, పాపని ఒక కంట కనిపెడుతూ ఉంటే పాప కొన్నేళ్ళకి కాస్త మామూలు మనిషి కావడానికి అవకాశం ఉంటుంది. అంతేకాదు ఎదిగే క్రమంలో మీరు చేసిన పొరపాట్ల వల్ల పాపలోపల అంతర్గతంగా ఉన్న లోపాలు (మల్టిపుల్ డీసీజెస్) ఇంకేమైనా ఉంటే బయటపడొచ్చు. అన్నిటికీ తట్టుకునే శక్తి తల్లిగా మీరు కలిగి ఉండాలి" డాక్టర్ నిరంజన్ చెప్తున్నారు. అందరూ వింటున్నారు. బయటకి వచ్చిపాపను తీసుకొని వెళుతున్నా అని చెప్పాను. ఎవరు ఆపలేదు." జరిగిన విషయం అంతా తల్లిదండ్రులకు చెప్పింది ఝాన్సీ.

*****

ఇలా తెలిసీ తెలియక చేసే పొరపాట్లకు అభంశుభం తెలియని పసిప్రాణాలు ఎంతటి అసాధారణ స్థితికి వెళుతు న్నాయో మనం బయట చూస్తూనే ఉన్నాం అయినా ఏమాత్రం మార్పు మనలో లేదు. చూడు సుభద్ర ఇప్పుడు నువ్వు ప్రెగ్నెంట్. ఫోన్ కాస్త తగ్గించు. ఎప్పుడు ఫోన్ లో మాట్లాడినా ఏడుస్తూనే మాట్లాడుతుంటావు. ఏవైనా కుటుంబ సమస్యలుంటే కూర్చొని పరిష్కరించుకోండి. లేదంటే నాలాగా నువ్వు అసాధారణ ప్రవర్తన కలిగిన పిల్లల్ని కనాల్సి ఉంటుంది. మా పాపకి వినబడదు కాబట్టి మాట్లాడదు. మానసిక పరిస్తితి బావుండదు. పదేళ్ళు దాటినా తనకి పాస్ పోసుకోవడం కూడా రాదు. అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చి నురగలు కక్కుకుంటూ పడిపోతుంది. ఫంక్షన్లకు పిలిస్తే ఈ పాపతో ఎక్కడ వస్తానో అని మా బంధువులు ఎవరూ మమ్మల్ని పిలవరు. కలుపుకోరు. కొందరైతే ఎందుకు ముదనష్టపు పాప ఏ మందో మాకో వేసి చంపేదానికి. ప్రశాంతత లేని జీవితం. భగవంతుడు ఇలాంటి వాళ్ళను పురిట్లోనే ఎందుకు తీసుకుపోడో... ఇలా ఎన్నో వింటుంటాను. నరాలు తెగిపోతుంటాయి. చంపేయాలన్నంత కోపం వస్తుంది. పాప అలా తయారవడానికి కారణం నేను. అయినా తను నా పాప. నా పాపే నాప్రాణం. 'పాప పున్నమి జీవితాన్ని నేను అమావాస్య చేసినా, నా అమావాస్య జీవితంలో పాపే వెన్నెల.'

"సుభద్రా.... మనసుభద్రం" అని చెప్పి అమ్మ,నాన్న ఎదురుచూస్తుంటారు అని చెప్పి కార్లో ఉన్న పాపవైపు ఝాన్సీ వెళ్లిపోయింది. వెళ్లిపోతున్న ఝాన్సీని చూసి సుభద్ర "నువ్వు నిజంగా ఝాన్సీవే... ఎంతటి గుండె ధైర్యం" అనుకుంటూ ఝాన్సీ వెళ్ళిన వెలుగు రేఖల్ని అనుసరించింది 'సుభద్ర'.




తిరుపతి లో ఒక ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజ్. అప్పుడే MCA పూర్తి చేసిన నేను ఆ కాలేజ్ లో కంప్యూటర్ ఫ్యాకల్టీ గా చేరాను. అపాయింట్ మెంట్ లెటర్ చేతికిస్తూ

"మీరు రేపే వచ్చి జాయిన్ అవ్వచ్చు." చెప్పాడు కాలేజ్ ప్రిన్సిపాల్.

"థ్యాంక్స్ సార్."

"ఎలాక్ట్రానిక్స్ లెక్చరర్ రాహుల్ ఒక్కడే ఒక రూమ్ లో ఉంటున్నాడు. మీకు అభ్యంతరం లేక పోతే మీరు తనతో రూమ్ ను షేర్ చేసుకోవచ్చు.

" సలహా ఇచ్చాడు ప్రిన్సిపాల్.

నేను ఏం చెప్పాలా   అని తటపటాయిస్తూ ఉండగానే ప్రిన్సిపాల్ ను విష్ చేస్తూ లోనికి వచ్చాడు ఓ యువకుడు. వయసు సుమారు పాతిక. ఆరడుగుల ఎత్తు, చామన ఛాయా.

“హలో ! రాహుల్! రండి. ఇతను గౌతమ్, కొత్తగా చేరిన కంప్యూటర్ లెక్చరర్. కొంత కాలం మీతో పాటు మీ రూమ్ లో ఉంటాడు.” నన్ను పరిచయం చేసాడు ప్రిన్సిపాల్.

“హలో!” నన్ను స్నేహపూర్వకంగా పలకరించాడు రాహుల్.

*************

రాహుల్ వయసులో నా కన్నా రెండేళ్ళు పెద్దవాడు. సిగరెట్, మందు అలవాటు ఉంది. ఎక్కువగా ఫోన్లో మాట్లాడుతూ ఉంటాడు. నేను వాటికి కాస్త దూరమే. రాహుల్   రూమ్ లో తక్కువగా ఉంటాడు. ఉన్నంతలో నాతో బాగానే మాట్లాడుతాడు.

***********

ఆ రోజు కాలేజ్ సెలవు. రాహుల్ ఉదయాన్నే బయటకు వెళ్ళాడు. మధ్యాహ్నం అయినా రాలేదు. తన ఫోన్ ఉదయం నుండి మ్రోగుతూనే ఉంది. తప్పని సరి పరిస్థితిలో తన ఫోన్ లిఫ్ట్ చేశా.

“ చాలా సార్లు ఫోన్ చేసాను. లిఫ్ట్ చెయ్యలేదు , బిజీ గా ఉన్నారా?” అవతల నుండి స్వీట్ వాయిస్ వినిపించింది.

“సారీ! నేను రాహుల్ కాదు, తను బయటకు వెళ్ళాడు. వచ్చాక కాల్ చెయ్యమని చెబుతాను.” పొడి పొడి గా మాట్లాడాను. ఫోన్ కట్ చేస్తూ ఉండగా

“మీరు............?”     అని వినబడింది.

“నేను గౌతమ్, రాహుల్   రూమ్ మేట్ ను.” చెప్పాను.

అవతల నుండి మళ్ళీ మౌనం, ఆ సారీ నేనే అడిగాను,”   మీరు.....?”

“నా గురించి రాహుల్ మీకు చెప్పలేదా?” కాస్త తటపటాయిస్తూ అడిగింది.

“అంటే అది...........”   ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఆలోచిస్తున్నా.

“నా పేరు ప్రసూన, నేను, రాహుల్ కొంత కాలంగా ఒకరినొకరు ఇష్ట పడుతున్నాం, త్వరలో పెళ్లి చేసుకోవాలని అనుకొంటూ ఉన్నాం .” సిగ్గుపడుతూ చెప్పింది.

“ఆ .....   అప్పుడప్పుడూ మీ గురించి చెబుతూ ఉంటాడు.” తన గురించి చెప్పలేదు అంటే నా వల్ల వారి మధ్య గొడవలు వస్తాయేమో అని, ఆమె సంతోషం కోసం అబద్ధం చెప్పాను.

“అవునా? నా గురించి ఏమి చెబుతుంటాడు?” ఉత్సాహంగా అడిగింది ఆ అమ్మాయి.

“అది... ఆ ..... మీరు చాలా మంచి వారని, చాలా అందంగా ఉంటారని, తను మిమ్మల్ని తరచూ కలుస్తూ ఉంటాడని చెబుతుంటాడు.” మరిన్ని అబద్ధాలు పోగు చేసి చెప్పాను.

నేను అలా చెప్పగానే తను గట్టిగా నవ్వేసింది.

“ఏమైంది , ఎందుకలా నవ్వుతున్నారు?” ఆశ్చర్యంగా అడిగా.

“మీ ఫ్రెండ్ రాహుల్ మీకు అబద్ధాలు చెప్పాడు. మేము ఇంతవరకు కలుసుకోనే లేదు. ఒకరినొకరు ఇంత వరకు చూడనేలేదు. “ చెప్పింది ప్రసూన.

“మరి ప్రేమించు కొంటూ ఉన్నామని అన్నావు?” ఆశ్చర్యంగా అడిగాను.

“ఫోన్ లోనే పరిచయం. ప్రేమలేఖ సినిమాలో లాగా ఒకరినొకరు చూసుకోకుండా ప్రేమించు కొందామని నిర్ణయించు కొన్నాం. ఇంతకీ మీ ఫ్రెండ్ రాహుల్ ఎలా ఉంటాడు? బాగుంటాడా?” అడిగింది ప్రసూన.

“సినిమా హీరో లా చాలా బాగుంటాడు.” చెప్పాను.

“మంచివాడే కదా?” మళ్ళీ అడిగింది.

నేను కాస్త ఆలోచించాను. రాహుల్ నాకు కేవలం కొంత కాలంగా మాత్రమే తెలుసు , తను మంచి వాడో, కాదో నేనెలా చెప్పగలను. అయినా ఈ ప్రపంచంలో మంచిచెడులు అనేవి ఎవరు నిర్ణయించగలరు? చూసే దృష్టి బట్టి వాటి రూపం మారిపోతూ ఉంటుంది.

హలో అన్నయ్యా! తను మంచి వాడే కదా?” మళ్ళీ అడిగింది. ఈ సారి నన్ను అన్నయ్యా అని కూడా పిలచింది.

“మంచి వాడు. “ అప్రయత్నంగా నేను రాహుల్ కు కాండక్ట్ సర్టిఫికేట్ ఇచ్చాను.

నేను అలా చెప్పగానే తను మరింత సంతోష పడినట్టు అనిపించింది.

“ఇంతకూ మీరు ఏం చేస్తుంటారు?” ప్రసూనను అడిగా.

“నేను వైజాక్ లో MBA చేస్తున్నా.” చెప్పింది ప్రసూన.

నేను తనను ఇంకేదో అడగబోయా,

“నేను తన గురించి ఎంక్వయిరీ చేసానని ఆయనకు చెప్పకండి!” బతిమాలినట్టు అడిగింది.

“నీతో ఫోన్లో మాట్లాడానని కూడా తనకు చెప్పను. నువ్వు కూడా చెప్పద్దు “

“ అలాగే అన్నయ్యా, మా నాన్నగారు వస్తునారు , నేను మరోసారి మాట్లాడుతాను.” చెప్పింది ప్రసూన.

“అలాగే ప్రసూన, ఉంటాను.” ఫోన్ కట్ చేసాను.

ఆ తరువాత రాహుల్ వచ్చాడు. నేను ప్రసూనతో మాట్లాడిన సంగతి తనకు చెప్పలేదు. బహుశా ప్రసూన కూడా చెప్పలేదేమో, రాహుల్ ఆ విషయం గూర్చి నాతో ఎప్పుడూ మాట్లాడలేదు.

************

రోజులు గడుస్తున్నాయ్.

ఆ రోజు నేను కాలేజ్ కు తయారవుతూ ఉన్నా. రాహుల్ నిద్ర లేచాడు కానీ తయారవలేదు.

“కాలేజ్ కు రావడంలేదా?” రాహుల్ ను అడిగా.

“కొద్దిగా తల నొప్పిగా ఉంది, అందుకే రావడంలేదు.” ముక్తసరిగా సమాధానం చెప్పాడు.

నేను కాలేజ్ కు బయలుదేరి వెళ్లి ఎప్పటిలాగే సాయంత్రం రూమ్ దగ్గరకు వచ్చా. క్రింద ఫ్లాట్ లోని అంటీ లు ఇద్దరు కుళాయి దగ్గర ఏదో గుసగుసలాడుతున్నారు.

“పొద్దున్నుండి రూమ్ లోనే ఉండి ఇంతకు ముందే బయటకు వెళ్ళింది.”     ఒక ఆంటీ మరో ఆంటీ తో అంది.

“నెలకు ఒకటికి రెండు సార్లు ఇలాంటివి జరుగూతే ఉన్నాయి.” మరో ఆంటీ చెబుతోంది.

“ఒక్కోసారి ఒక్కో అమ్మాయి వస్తూ ఉంటుంది.”

నన్ను చూడగానే గొంతు సవరించుకొని వాళ్ళు అక్కడ నుండి వెళ్ళిపోయారు.

నేను నేరుగా గదిలోకి వెళ్ళా. షూ విప్పుతూ చూసా, డస్ట్ బిన్ పక్కన వాడిపోయిన సన్నజాజులు, డస్ట్ బిన్ లో చిరిగిన కండోమ్ కవర్ పడి ఉన్నాయ్. డాబా పై రాహుల్ గొంతు సన్నగా వినిపిస్తోంది. “ఈ రోజు మొత్తం జూలి నా రూమ్ లోనే ఉంది. స్వర్గాన్ని చూసాననుకో. తను కూడా బాగా కోఆపరేట్ చేసింది.” ఎవరితోనో ఫోన్ లో చెబుతున్నాడు. నాకు రాహుల్ మీద అసహ్యం వేసింది.

***************

నేను రాహుల్ తో మాట్లాడడం బాగా తగ్గించేసా. “సెల్లూన్ షాప్ కు వెళ్తున్నా. వచ్చేటప్పుడు నీకు కూడా డిన్నర్ తీసుకొని వస్తా.” చెప్పి బయటకు వెళ్ళాడు రాహుల్.

ఆ రోజు మంగళవారం, పైగా రాత్రి 7 దాటింది. ఆ టైం లో సెల్లూన్ షాప్ కు ఎందుకు వెళ్తున్నాడో అర్థం కాలేదు. డ్రాయర్ లో చిందర వందరగా ఉన్న బుక్స్ ను సర్దుతున్నా. సైలెంట్ మోడ్ లో సైలెంట్ గా రింగ్ అవుతున్న రాహుల్ ఫోన్ కనబడింది. డిస్ప్లేపై ప్రసూన కాలింగ్ అని ఉంది. ఆ అమ్మాయితో మాట్లాడాలా? వద్దా?? అని ఆలోచించా. కాని తను నన్ను అన్నయ్యా అని పిలిచింది

గుర్తుకు వచ్చి ఫోన్ లిఫ్ట్ చేశా.

"నేను గౌతమ్ ను మాట్లాడుతున్నా. ఎలా ఉన్నావ్ ప్రసూనా?"

"నేను చాలా టెన్షన్ గా ఉన్నాను అన్నయ్యా! రేపు మీరు కూడా వస్తారు కదా!"

"టెన్షన్ ఎందుకు?"

"ఇంట్లో వాళ్లకు చెప్పకుండా పెళ్లి చేసుకోవడం అంటే టెన్షన్ ఉంటుంది కదా!! ఇంతకీ మా పెళ్ళికి మీరు కూడా వస్తారు కదా?"

"మీరు పెళ్లి చేసుకొంటున్న సంగతి రాహుల్ నాకు చెప్పలేదు."సూటిగా చెప్పా.

"అదేంటి అన్నయ్యా! మున్సిపల్ ఆపిస్ నుండి తన కొలీగ్స్ అందరూ వస్తారని చెప్పాడు?"

"మున్సిపల్ ఆఫీసా?"

"అవును, మున్సిపల్ ఆఫీసే."

"కాని ఇంట్లో వాళ్లకు చెప్పకుండా ఇలా పెళ్లి చేసుకోవడం అంత కరెక్ట్ కాదు కదా ?" ప్రసూనను అడిగా.

"నాకు ఇప్పుడు వేరే దారి లేదు అన్నయ్యా, నేను, రాహుల్ మూడు నెలలుగా ప్రేమించు కొంటున్నాం. కాని మా ఇంట్లో నాకు ఇష్టం లేని వేరే సంభందం ఫిక్స్ చేసారు. అందుకే వాళ్లకు తెలియకుండా రాహుల్ ను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకొన్నా "ఇంతకీ నీకు తోడుగా ఎవరు వస్తున్నారు?"

“నేను ఒక్కదాన్నే వస్తున్నా.” .

“కనీసం నీకు తోడుగా పెద్ద వారిని ఎవరినా ఒకరిని తీసుకోని రా! ఒక అన్నయ్యగా నీకు నేను ఇంతకు మించి ఏమీ చెప్పలేను.” ఫోన్ పెట్టేసా.

**************

ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. రాహుల్ తను మున్సిపల్ ఆఫీస్ లో పనిచేస్తున్నానని ప్రసూనకు అబద్ధం చెప్పాడు. నిజంగానే ప్రసూనను ప్రేమిస్తోంటే తనకు అబద్ధం చెప్పాల్సిన పనిలేదు. కానీ      అతన్ని నమ్మి ఆ అమ్మాయి ఇంట్లో వాళ్లకు తెలియకుండా తిరుపతికి వస్తోంది.

*************

పొద్దున నేను నిద్ర లేచేటప్పటికే రాహుల్ తయారయ్యి ఉన్నాడు, చాలా ఉత్సాహంగా కనబడుతున్నాడు. బహుశా ప్రసూనను పెళ్లి చేసుకోవడానికి వెళ్తున్నాడేమో.      నేను పేపర్ చదువుతున్నా. నాకు మాట మాత్రం కూడా చెప్పకుండా వెళ్ళిపోయాడు.

**************

నేను స్నానానికి వెళ్ళేటప్పుడు రాహుల్ ఒంటరిగా రూమ్ కు తిరిగి వచ్చాడు. ముఖం బాగా వాడిపోయి ఉంది. నేను తనను ఏమీ అడగలేదు. స్నానానికి వెళ్ళా. రాహుల్ ఫోన్ లో మాట్లాడడం నాకు వినిపించింది.

“ ఫిగర్ సూపర్ గా ఉంది. అది ఒక్కటే వస్తుందని అనుకొన్నా. కానీ దానితో పాటు వాళ్ళ ఆంటీ కూడా వచ్చింది. నా ప్లాన్ అంతా ఫెయిల్ అయ్యింది.” ఎవరితోనో చెప్పాడు.

“మరో రెండు రోజులు మంచి ముహూర్తాలు లేవు. రెండు రోజుల తర్వాత పెళ్లి చేసుకొందాం అని ఏదైనా హోటల్ కు తీసుకొని వెళ్లి రెండు రోజులు దానితో బాగా ఎంజాయ్ చేసి ఆ తరువాత వదిలేద్దాం అనుకొన్నా.”

అవతల వాడు మళ్ళీ ఏదో అడిగాడు, దానికి మళ్ళీ చెబుతున్నాడు.

“పెళ్ళికి కావాల్సిన వస్తువులు తీసుకొని వస్తాను. అప్పటిదాకా మీరు ఇక్కడే ఉండండి అని వాళ్ళను గోవిందరాజ స్వామి గుడి దగ్గర వదిలి రూమ్ కు వచ్చేసా. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేస్తున్నా. వాళ్ళు ఓ రెండు గంటలు వెయిట్ చేసి వెళ్ళిపోతారు. కొత్త నంబర్ తీసుకొన్నాక నీకు ఫోన్ చేస్తాను. బాయ్.” వాళ్ళ ఫ్రెండ్ కు ఎవరికో చెప్పాడు. వెంటనే తన ఫోన్ స్విచ్ ఆఫ్ అయిన సౌండ్ వచ్చింది.

నేను కాలేజ్ కు వెళ్ళా. నా మనసు మనసులో లేదు. రాహుల్ కోసం వాళ్ళు గుడి దగ్గరే వెయిట్ చేస్తూ ఉంటారు. వీడు వెళ్ళక పోయేసరికి ఆ అమ్మాయి కంగారు పడుతూ ఉంటుంది. తిరిగి ఇంటికి వెళ్ళే పరిస్థితి కూడా లేదు ఆ అమ్మాయికి. లంచ్ బెల్ కొట్టారు. రాహుల్ తినడానికి కేంటిన్ వెళ్ళాడు. నేను టూ అవర్స్ పర్మిషన్ తీసుకొని కాలేజ్ నుండి బయటకు వచ్చేసా. నేరుగా గోవిందరాజ స్వామి గుడికి వెళ్ళా. చుట్టూ చూశా. ధ్వజస్థంభం దగ్గర ఒక అమ్మాయి, ప్రక్కనే ఒక పెద్దావిడ ఇద్దరూ నిస్సహాయంగా చూస్తున్నారు. ఎదురు చూపులు చూసి వారి కళ్ళు అలసిపోయి ఉన్నాయి.

“ప్రసూన అంటే?” ఆ అమ్మాయిని అడిగా.

“మీరు?”

“నేను గౌతమ్ ను, రాహుల్ వాళ్ళ రూమ్ మేట్ ను”

తను ఒక్కసారిగా ఏడుస్తూ “అన్నయ్యా!” అంటూ నా గుండెల పై వాలిపోయింది. ఆ క్షణంలో కనీస పరిచయం కూడా లేని నేను తనకు ఆసరాగా నిలుస్తానని ఆ అమ్మాయి భావించింది. తనకు జరిగిందంతా వివరంగా చెప్పాను.

“తోడుగా పెద్ద వారిని ఎవరినైనా తీసుకొని రమ్మని నువ్వు ప్రసూనకు ఇచ్చిన సలహా వల్ల రేణిగుంట లో ఉన్న నాకు ప్రసూన ఫోన్

చేసింది. నన్ను తోడుగా రమ్మని అడిగింది. నేను పొద్దున్నే రేణిగుంటలో ట్రైన్ ఎక్కాను. మీరు ప్రసూనకు ఇచ్చిన సలహా వల్లే వాడి నిజ స్వరూపం తెలిసింది. అలాంటి వాళ్ళను ఊరికే వదల కూడదు. వాడిపై పోలీస్ స్టేషన్ లో కంప్లయింట్ ఇద్దాం." చెప్పింది ఆ పెద్దావిడ.

"వద్దు ఆంటీ. ముక్కూ ముఖం తెలియని వాడిని నమ్మి, ఇంట్లో వాళ్ళను వదలి రావడం నాదే తప్పు. " పీలగా చెప్పింది ప్రసూన.

"మరైతే నువ్వు ఇంటికి తిరిగి వెళ్ళగలవా?" ప్రసూనను సూటిగా అడిగా.

"నాకూ అదే అర్థం కావడం లేదు. ఈ సరికే నా కోసం మా అమ్మా, నాన్న వెతికి ఉంటారు. ఇప్పుడు వాళ్లకు జరిగిన విషయం తెలిస్తే నన్ను ఇంట్లో కు రానివ్వరు." ఏడుస్తూ చెప్పింది ప్రసూన.

"మీకు ప్రసూన ఎలా పరిచయం?" ఆ పెద్దావిడను అడిగా.

"మేము కొంత కాలం వైజాగ్ లో ప్రసూన వాళ్ళ పక్కింట్లో అద్దెకు ఉండే వాళ్ళం. మా ఆయన రైల్వే లో పనిచేసే వారు. ఆయనకు రేణిగుంట కు ట్రాన్స్ఫర్ అవడంతో చాలా ఏళ్ల క్రితమే రేణిగుంట లో స్థిరపడి పోయాం. ఆ తరువాత ఆయన ఆక్సిడెంట్ లో చనిపోయారు. ఆ వచ్చే పెన్షన్ తో నేను మా అబ్బాయిని చదివిస్తూ రేణిగుంట లోనే ఉండిపోయా." చెప్పింది ఆ పెద్దావిడ.

"ఇప్పుడు మీ అబ్బాయి ఏం చదువుతున్నాడు?"

"బిటెక్ , సెకండ్ ఇయర్ "

"మీ అబ్బాయికి ప్రసూన వాళ్ళ నాన్న గారితో పరిచయం ఉందా?"

"మేము వైజాగ్ లో ఉన్నప్పుడు మా అబ్బాయి చాలా చిన్న వాడు. వాడికి ప్రసూన వాళ్ళ నాన్నతో పరిచయం లేదు."

"మీ అబ్బాయి పేరు?"

"ప్రవీణ్"

"మీ పేరు?"

"సులోచనమ్మ"

నేను బాగా ఆలోచించా. సులోచనమ్మ ఫోన్ తీసుకొని ప్రసూన వాళ్ళ నాన్నకు డయల్ చెయ్యమని ప్రసూనకు చెప్పా. ప్రసూన భయపడుతూ సులోచనమ్మ ఫోన్ నుండి తన తండ్రికి కాల్ చేసింది. ఒక్క రింగ్ లోనే కాల్ లిఫ్ట్ చేసాడు ప్రసూన వాళ్ళ నాన్న.

"హలో!" వారి గొంతులో ఆత్రుత కనబడింది.

"అంకుల్! నేను సులోచనమ్మ గారి అబ్బాయి ప్రవీణ్ ను మాట్లాడుతున్నా, రేణిగుంట నుండి."

"చెప్పు బాబు!"

"ప్రసూనా అక్కను ట్రైన్ ఎక్కిస్తున్నాను. రేపు స్టేషన్ దగ్గరకు వచ్చి తనను పికప్ చేసుకోండి."

"ప్రసూన అక్కడకు వచ్చిందా?"

"అవును అంకుల్. నిన్న అమ్మ షాపింగ్ కోసం తిరుపతికి వచ్చినప్పుడు సడన్ గా హార్ట్ ఎటాక్ వచ్చిందట. షాప్ వాళ్ళు

అంబులెన్సు లో అమ్మను హాస్పిటల్ కు పంపించారు. అమ్మ ఫోన్ లో డయల్ నంబర్స్ లో ప్రసూన అక్క నెంబర్ ఉండడం తో హాస్పిటల్ వాళ్ళు ప్రసూన అక్కకు ఫోన్ చేసి వెంటనే రమ్మని చెప్పారట. అక్క కంగారు పడుతూ వచ్చేసింది. తను ఇప్పటి వరకూ హాస్పిటల్ లో అమ్మకు తోడుగా ఉంది. ఇదిగో అక్క దగ్గర ఇస్తున్నా ! మాట్లాడండి." అంటూ ఫోన్ ప్రసూనకు ఇచ్చాను.

"హ...హలో!" భయపడుతూ అంది ప్రసూన.

"ఏమ్మా ! వెళ్ళేటప్పుడు చెప్పేసి వెళ్ళాలి కదా! నువ్వు కనబడక పోయే సరికి ఎంత కంగారు పడ్డామో తెలుసా? మీ అమ్మ అయితే రాత్రి నుండి ఏడుస్తూనే ఉంది."

"సారీ నాన్న ! ఆంటీ కు హార్ట్ ఎటాక్ అని ఫోన్ వచ్చినప్పుడు మీరు ఇంట్లో లేరు. గుడికి వెళ్లి పోయారు. ఆ టైం లో ఏం చెయ్యాలో అర్థం కాలేదు. అదే టైం లో వైజాక్ నుండి తిరుపతి కి ట్రైన్ ఉండడం తో వెంటనే బయలు దేరాను. స్టేషన్ కు వచ్చాక మీకు ఫోన్ చేద్దామంటే నా ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. హాస్పిటల్ కు వచ్చాక ఫోన్ చెయ్యడం కుదరలేదు." ఒక్కో అబద్ధాన్ని ఏర్చి , కూర్చి చెప్పింది ప్రసూన.

"ఇంతకీ ఇప్పుడు ఆంటీ కు ఎలా ఉంది?"

బాగుంది నాన్న."

"సరే, జాగ్రత్తగా వచ్చెయ్. నేను స్టేషన్ లో వెయిట్ చేస్తూ ఉంటాను." ఫోన్ పెట్టేసాడు ప్రసూన వాళ్ళ నాన్న.

ప్రసూన ఊపిరి పీల్చుకొంది. తన ముఖం లో సంతోషం కనబడింది. నా వైపు కృతజ్ఞతగా చూసింది. తన చూపు నా మనసులో స్థిరంగా నిలచిపోయింది.

********************

తిరిగి సాయంత్రం కాలేజ్ కు వెళ్ళాను.  స్టాఫ్ అందరూ తమ పనులు మానుకొని ఏదో గుసగుసలాడుకొంటూ ఉన్నారు. నేను స్టాఫ్ రూమ్ కెళ్ళి నా టేబుల్ ముందు కూర్చొన్నాను. అటెండర్ సుబ్బారావ్ టి తీసుకొని వచ్చాడు. "ఏమైంది? అందరూ పనులు మానుకొని మీటింగ్ పెట్టారు?"  సుబ్బారావ్ ను అడిగా.

"మీ రూమ్ మేట్ రాహుల్ సార్ ను పోలీసులు పట్టుకొని వెళ్ళారు సార్!"

"పోలీసులా? ఎందుకు??"

"నెల రోజుల క్రితం ఎవరో అమ్మాయిని ప్రేమిస్తున్నానని వెంటబడి, పెళ్ళిచేసుకొంటానని నమ్మించి, ఆ అమ్మాయిని  మోసంచేసి, అప్పటినుండి కనబడకుండా తిరుగుతున్నాడని ఆ అమ్మాయి పోలీస్ స్టేషన్ లో కంప్లయింట్ ఇచ్చిందట. పోలీసులు ఇంతకాలానికి ఆ అమ్మాయిని మోసం చేసిన వాడు రాహుల్ సార్ అని గుర్తించి అరెస్ట్ చేసారు."  చెప్పాడు సుబ్బారావ్.

సుబ్బారావ్ చెప్పింది వినగానే నాకు చాలా సంతోషం వేసింది. తప్పుడు ఆలోచనలు ఉన్న వాడు, తప్పుడు పనులు చేసేవాడు ఎప్పటికైనా తమ పాపాలకు తగిన మూల్యాన్ని అనుభవించాల్సిందే.




శైలూ.. ప్రమోద్ క్యాబిన్ దగ్గరకొచ్చి కొత్తగా కొన్న స్మార్ట్ ఫోన్ చూపిస్తోంది. ఫోన్ సంగతేమోగానీ.. ఆడతనపు సింగారాన్ని అంత దగ్గరగా చూసేసరికి ప్రమోద్ కి గుండెలయ తప్పినట్టయ్యింది. ఆఫీసులో రోజూ కలిసి మాట్లాడే అమ్మాయే శైలూ. కానీ, ఇంతలా తనను దగ్గరగా చూసింది ఎప్పుడూ లేదు. రెండు శరీరాల మధ్య కెమిస్ట్రీ అంటుంటారు.. వినడమేగానీ, అనుభవించింది లేదు. అదేంటో తొలిసారిగా అర్థమవుతోంది ప్రమోద్ కి. అనుకోని అతిథిలా తనువంతా ఆక్రమించుకున్న రసానుభూతిని నిశ్శబ్దంగా ఆహ్వానిస్తూనే..

'' ఓహ్.. కంగ్రాట్స్.. చాలా బావుంది శైలూ.. ఏంటీ స్పెషల్? గిఫ్టా?'' శైలు చేతిలోని ఫోన్ ని తన చేతిలోకి తీసుకుంటూ అడిగాడు ప్రమోద్.

''యస్.. స్పెషల్ గిఫ్టే. ఇది రాజేష్ ఇచ్చిన సర్ ప్రైజ్ గిఫ్ట్. కొత్తమోడల్. మార్కెట్లోకి రాలేదట. ఆన్ లైన్లో బుక్ చేసి తీసుకున్నాడు. బావుంది కదూ?'' ప్రమోద్ కూర్చున్న కుర్చీ హ్యాండిల్ కి జారబడి ఎంతో ఆనందంగా చెప్తోంది శైలు.

ప్రమోద్ కుడిచేతి మోచేతికి.. ఏదో మెత్తగా తాకిన అనుభవం. ఒకపక్క ఫోన్ డిస్ ప్లే చెక్ చేస్తూనే.. అదే ఓరకంటతో.. తన మోచేతిని తాకుతున్న శైలు నడుము.. ఆ నడుము ఒంపుల్లో దాగిన నాభి సౌందర్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. శరీరం మరింతగా

బరువెక్కుతోంది. కానీ శైలూ మాత్రం అప్రయత్నంగానే దగ్గరైంది. అందులో ఏమర్మం లేదని ప్రమోద్ కి తెలుసు.

"ఫోన్ స్టయిలిష్ గా.. స్లిమ్ గా.. చాలా బావుంది. మెడలో నాలుగు ముళ్ళు పడకుండానే రాజేష్ తో.. షాపింగ్ చేయించేస్తున్నావన్నమాట" లోపల రగులుతున్న వేడిని కంట్రోల్ చేసుకుంటూ.. అది పైకి ఏమాత్రం కనపడకుండా నవ్వుతూ అడిగాడు ప్రమోద్.

" అంతేగా మరి. పెళ్ళయితే.. అడగ్గానే ఇంత ప్రేమగా కొనిస్తాడా? ఇప్పుడైతే అడక్కుండానే ఇచ్చాడు" ఫకాలున నవ్వేస్తూ.. ప్రమోద్ చేతిలో ఫోన్ తీసుకుని.. ఇంకాస్త దగ్గరగా జరిగి నాలుగైదు సెల్ఫీలు దిగింది శైలు. సెల్ఫీలు పుణ్యమా.. అని.. శైలూ శరీరపు పలకరింత ప్రమోద్ లో మరింత వేడి పుట్టించింది.

" ఏమాత్రం అరమరికలు లేకుండా.. అబ్బాయిల మీదపడే ఈ శైలూని ఇన్నాళ్ళూ ఎందుకు పట్టించుకోకుండా వదిలేశానబ్బా.. ప్చ్.. ఇప్పుడు బాదపడి ఏంలాభం.. రాజేష్ తన్నుకుపోతున్నాడుగా.." లోలోనే తెగ బాధపడిపోయాడు.

"సరే.. బై ప్రమోద్! మన బాస్ వచ్చే టైమైంది. ఈ సెల్ఫీలు గట్రా చూశాడో.. ఏడుస్తాడు.." నవ్వేస్తూ తన సీట్లోకి వెళ్ళిపోయింది శైలు. ప్రమోద్ కి.. మామూలు స్థితికి రావడానికి చాలాసేపు పట్టింది. "పెళ్లి చేసుకుంటే.. శైలూలాంటి ఫిజిక్, మోడ్రన్ గా ఉన్న అమ్మాయినే చేసుకోవాలి" అని మనసులోనే అనుకుంటూ ఆమెను అలా చూస్తూ ఉండిపోయాడు ప్రమోద్..

****

ఉదయం.. ఆరుగంటలు.

ఇంకా కలత నిద్రలోనే ఉన్నాడు ప్రమోద్. దిండుకింద ఉన్న ఫోన్ మోగుతోంది.

"రేయ్.. ప్రమోద్. వచ్చే ఆదివారం నీ పెళ్లిచూపులు. శనివారం ఉదయానికల్లా నువ్వు ఊర్లో ఉండాలి.. సరేనా" అవతల స్వరం చెప్పాల్సింది చెప్పేసింది.

''నాన్నా.. ఇంత సడన్ గా పెళ్లిచూపులేంటి. అయినా పెళ్లికి అంత తొందరేమొచ్చింది?''  కొంచెం ధైర్యం కూడదీసుకునే అడిగాడు.

'' ఇదిగో చిన్నోడా.. ఇప్పటిదాకా నువ్వు.... మంచి ఉద్యోగం రావాలి. ఇంతకంటే బాగా సెటిలవ్వాలి.. అప్పటిదాకా పెళ్ళికాగుతా.. అంటే.... సరేలే నీమాట ఎందుకు కాదనాలని ఓపికపట్టాం. నువ్వు ఎప్పటికప్పుడు ఇలా ఏవో ఒకటి కుంటిసాకులు చెప్తూ.. కూర్చుంటే.. పిల్లదొరక్క.. మీ అమ్మ నేనూ 'మా అబ్బాయికి.. పిల్లనెతికిపెట్టండి బాబయ్యా!'' అంటూ ఊరూరా చెప్పులరిగేలా తిరగాలి'' ఫోన్లో అవతలి స్వరం కాస్తంత కరువుగానే వినిపించింది. ప్రమోద్ తండ్రి పార్వతీశం పెద్దగా ఎప్పుడూ కొడుకుపై కోప్పడింది లేదు. కానీ, ఒక్కసారిగా అలా తండ్రి ఫోన్లోనే విరుచుకుపడే సరికి బిత్తరపోయాడు ప్రమోద్.

'' ఇప్పటిదాకా.. పెళ్లిపెటాకులు లేకుండా గడిపింది చాల్లేగానీ.. ఇప్పుడు బాగానే సంపాదిస్తున్నావ్ గా. వచ్చిన సంబంధం బావుంది. మనకంటే స్థితిమంతులు. పైగా అమ్మాయి లక్షణంగా ఉందట. నీకూ.. ఈడూ జోడు బావుంటుందనే.. మేం.. ఆ సంబంధం ఖాయం చెయ్యాలనుకుంటున్నాం. ఇంకేం మాట్లాడమాక'' అల్టిమేటమ్ జారీ చేశాడు ప్రమోద్ తండ్రి.

నిజానికి పెళ్లిచూపుల విషయంలో అడ్డు చెప్పడానికి ప్రమోద్ దగ్గర ఇప్పుడు పెద్దగా  కారణాలు ఏమీ లేవు. వయసు ముప్పయిదాటి రెండు మూడేళ్ళయ్యింది. పెళ్లి చేసుకోవడానికి పిల్లే దొరకలేదా? అంటే అదీకాదు. ఉద్యోగంలో మంచి పొజిషన్ కి రావాలంటూ.. ఇప్పటిదాకా.. పెళ్లి ప్రస్తావన నాన్చుతూ వచ్చిన ప్రమోద్ కి, మరోపక్క ప్రేమలు, దోమలు అన్నా చిరాకే. అలాంటిదేదైనా కమిట్ అయితే, ఎక్కడ తనకు వచ్చే కట్నకానుకలు తగ్గిపోతాయో? అని భయపడే రకం. అందుకే, కంటికి నచ్చిన అమ్మాయిలు కనిపించినా.. ఒకరిద్దరు.. గర్ల్ ఫ్రెండ్స్ లవ్ ప్రపోజల్స్ తో దగ్గరవ్వాలని ప్రయత్నించినాగానీ, ఎక్కడ పెళ్లికి ఒప్పుకోవాల్సి వస్తుందోనని భయపడి అమ్మాయిలకు దూరంగా ఉంటూ వచ్చాడు.

అయితే, పెళ్లి విషయానికొస్తే.. తనకు కాబోయే పెళ్ళాం.. అత్యాధునికమైన అమ్మాయై ఉండాలనేది అతడి మనసులో బలంగా నాటుకుపోయింది. ''ఊరుపట్టున ఉండే ఆడపిల్లల్లో.. సెక్స్ అప్పీల్ తక్కువగా ఉంటుంది. పట్నం అమ్మాయిల్లా.. తీరైన అవయువ సౌష్టంపై శ్రద్ధపెట్టాలనే ధ్యాసే వాళ్ళకు ఉండదు'' అనుకునే పూలిష్ మెంటాల్టి ప్రమోద్ ది. పుట్టిపెరిగింది పక్కా పల్లోలోనైనా ఎందుకనో.. ఊళ్ళో ఆడపిల్లలంటే అతడికి చులకన. ఆ కారణంతోనే, ఇప్పటిదాకా.. ఇంట్లో ఎన్ని సంబంధాలు చూసినా.. పల్లెటూరమ్మాయితో పెళ్లి సంబంధం అని తెలియగానే,  ఏదో ఒక కుంటిసాకు చెప్పి తప్పించుకోవడం ప్రమోద్ కి బాగా అలవాటయ్యింది. కానీ ఈసారి మాత్రం తప్పించుకోవడానికి అవకాశంలేదు.  '' ఈ అమ్మాయితోనే నీ పెళ్లి ఖరారు..' అని తేల్చినట్టుగా తండ్రి స్వరం ఫోన్లో మారుమోగింది. పైగా కొలీగ్ శైలూ.. తాజాగా శరీరంలో మొలకెత్తించిన కోరికలు.. ఇంకా ప్రమోద్ ని వెంటాడుతూనే ఉన్నాయి. దీంతో.. పెళ్లిచూపులు చూడ్డానికి, పెళ్లికీ సిద్ధమయ్యాడు.

****

గదిలో పూలపందిరి అలంకరణ బావుంది. అమ్మాయి రాకుండానే పూలపరిమళం, అగరబత్తీల గుభాళింపుతో గదంతా మత్తుగా ఉంది. ఇప్పటికీ శోభనపు తంతు పాతపద్ధుల్లోనే కొనసాగించడం ప్రమోద్ కీ బాగా నచ్చింది. ఇక అమ్మాయి రాకే ఆలస్యం. కానీ.. ఆ సమయంలోనూ.. ప్రమోద్ కి శైలూ గుర్తొస్తుంది. 'మళ్ళీ అలాంటి స్పర్శను తిరిగి దక్కించుకోవడం కష్టమే. శైలూ ముందు.. అజంతా శిల్పంకూడా తక్కువే. చూపులతోనే కొలతలేసి మరీ చెప్పొచ్చు తన అందచందాల్ని.. ప్చ..'' అని మనసులో ఒకింత నిష్ఠూరపడుతున్న సమయంలో.. నెమ్మదిగా తలుపు తీసుకుంటూ.. లోపలకొచ్చింది కొత్తపెళ్లికూతురు.

దగ్గరగా వస్తూనే ప్రమోద్ ని కళ్ళతోనే పలకరించింది. శరీరానికి బిగుతుగా కట్టిన తెల్లని పట్టుచీరలో ఉమ తళతళా మెరిసిపోతుంది. దానికి తోడు.. సన్నని వొంకీలు తిరిగిన కురులు.. వదులుగా ఉంచి.. తలలో సరిపడినన్ని మల్లెపూలు అలంకరణ. చూడ్డానికి సింపుల్ గా.. ఉన్నా.. ఆమె అలా నెమ్మదిగా నడిచి వస్తుంటే.. పౌర్ణమివేళ.. సముద్రపు తీరాన.. వయ్యారంగా నడిచివస్తున్న కావ్యకన్నెలా ఉంది.

ఒక్కింత సిగ్గుపడుతూనే ప్రమోద్ దగ్గరకొచ్చి కూర్చుందామె.

'' కాచిన పాలు ఇక్కడే చెంబులో ఉన్నాయంట. అమ్మ చెప్పింది. అందుకే పాలగ్లాసుతో రాలేదు. గ్లాసులో వేసిస్తా.. తాగండి.. '' కొంచెం భయం, సిగ్గు కలబోతగా పాలచెంబు వైపు తిరిగిందామె.

ఆమె.. అటు తిరిగిందోలేదో.. ఉమ వెనకభాగంపై అనుకోకుండా ప్రమోద్ చూపుపడింది. నడుముకి.. మెడకు మధ్యగల దూరానికి వారధికట్టినట్టుగా.. జాజివర్ణపు జాకెట్టు. మధ్యలోంచి బాణంలాంటి చీలిక. అలా మంచంపై ఓపక్కగా కూర్చుని, చెంబులోంచి గ్లాసులోకి పాలు ఒంపుతున్న సమయంలో ఆమె నడుము ఒంపులు తిరుగుతోంది. నిటారుగా నిలబడ్డ వీపు.. పూలపాన్పుని మైమరపిస్తోంది. ప్రమోద్ లో అలజడి మొదలైంది.

'' ముందు.. భర్తకు పాలు ఇవ్వాలంటగా.. '' ప్రమోద్ చేతికి పాలగ్లాసు అందిస్తూ అంది ఉమ.

“ ఇది.. కూడా మీ అమ్మే చెప్పిందా?!” సరసంగానే మాటలు కలిపాడు ప్రమోద్. ఏమాత్రం శబ్దంలేకుండా చిరునవ్వుల్ని ఎంతో అందగా ఒలకబోశాయి ఆమె కాటుక కళ్ళు. పాలు కూడా సగభాగం అయ్యాయి.

“పాలు తాగేశాంగా.. ఇక కూర్చోమరి..” చేయిపట్టుకుని ఆమెను ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు. తను.. తనువు.. రెండూ ఒకటై.. దగ్గరగా జరిగేకొద్దీ.. జివితంలో ఎప్పడూ చూడనంత అద్భుతం చూస్తున్నట్టుగా ఉంది అతడికి. సిగ్గుతో అటువైపుగా ఓరగా వొంగిందామె.

సన్నటి దీపపు వెలుతురులోనూ.. విప్పారిన ఆమె వీపు భాగం వెలిగిపోతుంది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా.. రెండు చేతుల్లో ఆమెను ఆమాంతంగా చుట్టేసుకుంటూ.. భుజాలపై మొఖాన్ని వాల్చి.. ఆఘ్రానింపు పరవశంలో మునిగిపోసాగాడు. ఆమె భుజాలు పాలసముద్రంలోని కెరటాల్లా మెరిపోతున్నాయి. మెడవొంపుల్లోంచి.. సుడులు తిరిగిన కురులు, వాటి మధ్య అల్లుకున్న మల్లెలపరిమళం.. కలబోతయై.. ప్రమోద్ ని.. ఎక్కడికో తీసుకెళుతున్నాయి. అటుగా తిరిగినామెను.. తనవైపు లాక్కోబోయాడు.

సిగ్గులు మొగ్గవుతున్న వేళ గదిలో వెలుగుతున్న బెడ్ లైట్ ఆర్పేందుకు లేవబోయింది ఆమె. వారించబోయేంతలో ఆమె పవిట అతడి చేతుల్లో పడి అప్రయ్నంగానే నేలపై జారిపడింది. చూపులు తిప్పుకోలేని ఆడతనం అతడిని కళ్ళప్పగించేలా చేస్తోంది. జారిపడ్డ పైట ఎదపొంగుపై వేసుకునేలోపే.. నడుపై చేయివేసి ఆమెను అలాగే మరింత దగ్గరకు తీసుకున్నాడతడు. ఎదపొంగులు పరవళ్ళు తొక్కినట్టుగా ఉందామె స్థితి కూడా.

“ ఎన్నెన్ని పర్వతశిఖరాలు అదిరోహించి తపస్సు చేస్తే.. ఇంతటి ఫలం దక్కుతోంది. అడ్డుతెరగా ఉన్న జాకెట్టు హుక్స్ అతడి ప్రమేయంతో ఒక్కసారిగా సంకెళ్ళు తెంచుకోసాగాయి. అచ్ఛాదనలేని సజీవమైన పాలరాతి శిల్పంలా ఆమె. రాత్రంతా ఆ శిల్పసౌందర్యంలోనే తన్మయత్వం చెందేందుకు సిద్ధపడుతున్నవాడిలా అతడు. ఒక్కొక్కటిగా రెండు శరీరాలు నూలుపోగులేని స్థితిలోకి జారుతున్నాయి. రెండు అల్లుకున్న శరీరాల బరువుతో పందిరిమంచం కూడా ఆరాత్రిలో పలుసార్లు నిశ్శబ్దపు ఊయ్యాలయ్యింది.

***

తెల్లారింది. శోభనపు పాన్పుపై మగత నిద్రలో ఉన్న భార్యను మరోసారి తృప్తిగా చూసుకున్నాడు. “ ప్రియమైన పల్లెటూరి భార్యా.. నన్ను క్షమించవా?” అని పల్లెటూరమ్మాయిలందరికీ తన భార్య సాక్షిగా మనసులోనే శిరస్సువంచి క్షమాపణ చెప్పుకున్నాడు. ఇంతలో కొలీగ్ శైలూ నుంచి ఫోన్..

“హాయ్ ప్రమోద్.. నీపెళ్లికి రాలేకపోయా. సారీ డియర్. అదే రోజు.. రాజేష్ కి, నాకూ ఎంగేజ్మెంట్ ఫంక్షన్ జరిగింది. సడన్ గా అనుకుని.. ఆరోజు ఇంట్లోవాళ్ళు అలా కానిచ్చేశారన్నమాట. అన్నట్టు..నీకోసం.. చిన్న గోల్డ్ రింగ్, మీ బంగారం కోసం చీర.. ఇక్కడ వెయిట్ చేస్తున్నాయ్.      ఊళ్ళోకి ఎప్పుడొస్తున్నావోయ్?”      అని శైలూ ఎంతో ఆప్యాయంగా అడగ్గానే..

“ అదేంటి.. గోల్డ్ రింగులు, చీరలు.. అవన్నీ ఇప్పుడు ఎందుకు శైలూ” ఆశ్చర్యపోతూ అడిగాడు ప్రమోద్ “ ఇదిగో మిష్టర్ ప్రమోద్..      మా ఇంట్లో మగపిల్లలు లేరు. ఉంటే గింటే నేనొక్కతినే మగరాయుడ్ని. ఏం.. అన్నయ్యలాంటి ప్రమోద్ కి.. సిస్టర్ శైలూ.. ఈ మాత్రం బుల్లిగిఫ్ట్ ఇవ్వకూడదా..” అలా శైలూ ఫోన్లో సొంత చెల్లెలు కంటే ఎక్కువుగా.. ప్రేమగా దబాయించినట్టు అడుగుతుంటే ప్రమోద్ కి.. ఒక్కసారిగా మనసు ఆర్ధ్రమైంది. కాసేపట్లో శైలూతో ఫోన్ సంభాషణ ముగిసింది.

“ ఓ ఆడపిల్ల.. మగవాళ్ళతో కలుపుగోలు తనంతో ఉంటే అది సరస శృంగారానికి స్వాగతం పలకడంలాంటిదని అనుకోవడం ఎంత అనాగరికం. ఓహ్.. షిట్.. చదువుకున్నవాడినై ఉండికూడా      శైలూ గురించి ఎంత తప్పుగా ఆలోచించాను. ఆమె క్యారెక్టర్ని అలా చీప్ గా అంచనావేస్తే.. ఆమె మాత్రం.. నన్నొ తోబుట్టువుగా భావించింది. ఐయామ్ సారీ.. శైలూ.. ఐయామ్ ఏ బిగ్ స్టుపిడ్ ఫెలో..బహుశా మగబుద్ధి అంటే ఇదేనేమో?!” కనువిప్పుతో అతడి కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి.




కెమేరా తీసుకోని హోటల్ లోంచి బయట పడ్డాడు కుమార్. కుమార్ వొక పేరుమోసిన పత్రికలో విలేఖరిగా పనిచేస్తున్నాడు. కెమెరా

పట్టుకొని బయటికి వెళ్ళాడంటే సెన్సేషనల్ వార్త సంపాదించి తీరతాడని అతని సహోద్యోగుల మాట . శ్రీరాముడికి ధనుస్సు ,ఆంజనేయుడికి గద లాగ కుమార్ కి కెమేరా అలాగ.

వీధులన్నీ పట్టపగలు లా కళకళ లాడుతున్నాయి .సాయంత్రం ఎనిమిది గంటల వరకు నిద్ర పోతున్నట్టు వుండే వీధులన్నీ ఒక్కసారిగా దీపావళిని తలపిస్తాయి. నిమిషాలమీద రోడ్ల పైన డిస్కో బార్లు వెలుస్తాయి. డబ్బుతో కొనగలిగినవన్నీ అమ్మకానికి తయారుగా వుంటాయి. అంగడి బొమ్మలు అందాలు ఆరబోస్తూ దర్శనం యిస్తారు . విటులని ఆకర్షించడానికి రకరకాల విన్యాసాలు చేస్తూ వుంటారు. హోరెత్తించే మ్యూజిక్, దానికి అనుగుణంగా శరీర భాగాలని కదుపుతూ అటు యిటూ తిరుగుతున్న డాన్సర్లు.ఒంటి పైన చిన్న చిన్న బట్టలు ధరించిన ఆడ బొమ్మలు కొన్ని కస్టమర్ల గ్లాసులు నింపుతూ అటూ యిటూ తిరుగుతున్నాయి .వాళ్ళ దేశాలలో దొరకని విచ్చలవిడి తనాన్ని కొనుక్కోడానికి ఈ దేశం వచ్చిన విదేశస్తులతో ఆ వీధి నిండి పోయింది.

ప్రతీ బారులోంచి కొంపలు కాలుతున్నంత సిగిరెట్ పొగ, దాంతో లోపలి మనుషులు మసకబారి కనిపిస్తున్నారు.కొంపలు కొట్టుకు పోయేంత తాగుడు అందిస్తున్న వారకాంతలు మత్తెక్కిన కళ్ళకు అమృతంమందిస్తున్న అప్సరసల్లా కనిపిస్తున్నారు. రోడ్డు పైన వెలసిన మాంశాహారపు దుకాణాలలోంచి యేదో జంతువుని కాలుస్తున్న వాసన యివన్నీ ఈరాత్రి బజారులో సర్వసాధారణం.

ఫుట్ పాత్ మీద నడుస్తున్న కుమార్ కి సిగిరెట్ వాసన, మాంశం కాలుతున్న దుర్గంధం కలసి కడుపులో కవ్వం పెట్టి కలుపుతున్న అనుభూతి కలుగుతోంది. కడుపులో కదులుతున్న కంగాళీ ఎప్పుడు వాంతి రూపంలో బయటకి వద్దామా అని కాచుకొని ఉంది. అయినా తన అన్వేషణ ఆపదల్చుకోలేదు . కుమార్ కి తెలుసు యిలాంటి బురదలోంచే లక్ష్మీవాసమైన కమలాల్లాంటి కథల పుట్టినిళ్ళని. అందుకే ప్రతీ బార్ ని పరీక్షగా చూసుకుంటూ నడుస్తున్నాడు.ఆ వాకింగ్ స్ట్రీట్ లో తిరుగుతూ అప్పుడే వో గంట గడిచింది. మొత్తం వీధి రెండు చెక్కర్లు కొట్టేడు.యివాళ అదృష్టం వక్రించి నట్లుంది. ఇంక లాభం లేదు వర్తాన్వేషణ ఆపి హోటల్ కి వెళ్ళిపోదాం అని వెనక్కి తిరగబోయేడు. ట్రే లో రకరకాలైన మత్తుపానీయాలతో నింపిన గ్లాసులు తెస్తున్నామే పై పడింది కుమార్ చూపు.ఆమె తనకు బాగా తెలిసిన మనిషిలా అనిపించింది.ఆమె యెవరు అన్నది జ్ఞాపకం రాలేదు.ఆమె యెవరో తెలుసుకోవాలనే కుతూహలం ముందు కడుపులో తెమల్చుతున్న కంగాళీ కుడా బలాదూర్ అయ్యింది. అందుకే నాలుగడుగులు ముందుకి వేసి బారులోకి నడిచేడు కుమార్ .

డిస్కో లైట్ల మధ్య డాన్స్ పేరుతో పిచ్చి గంతులేస్తున్న వాళ్ళని కళ్ళార్పకుండా చూడసాగేడు. అక్కడికి వచ్చేవాళ్ళ అందరి చూపులు అలానే ఏదో వెతుకు తున్నట్టె ఉండడంతో కుమార్ చూపులు ఎవరికీ ఎబ్బెట్టుగా అనిపించ లేదు. ఆర్డర్ తీసుకొడానికి టేబుల్ దగ్గరకి వచ్చిన ఆమెని పరీక్షగా చూసేడు. బాగా తెలిసిన మనిషి లా అనిపిస్తోంది, ఒక్కసారి కళ్ళు మూసుకొని ఆలోచించసాగేడు. అప్పుడు గుర్తొచ్చింది ఓ ఆరేడు సంవత్సరాల కి ముందు వెండితెర మీద ధ్రువతారగా మెరిసి చాలా కొద్ది సమయంలో మంచి ఆర్టిస్టుగా పేరు తెచ్చుకుంటున్న సమయంలో అకస్మాత్తుగా మాయమైన అందానికి మారుపేరుగా

అభిమానులచే పిలిపించుకున్న "అరుంధతి ". కళ్ళముందు కనిపిస్తున్నది కలో నిజమో తెలియటం లేదు కుమార్ కి, అంత పేరు,అంతడబ్బు ఆర్జించిన ఆమె యిప్పుడు ఇలాంటి దీనస్తితిలో యెందుకుంది ? టాలీవుడ్ లో తళ తళా మెరిసే అరుంధతి ఒక్క ఆరేడు సంవత్సరాలలో రంగు వెలసిన బొమ్మై ,పొట్ట గడవడం కోసం పరాయి దేశం లో పడుపు వృత్తిలో ఎందుకు గడుపుతోంది ? కుమార్ లో అన్నీ ప్రశ్నలే, మరొకరి జీవితంలొకి తొంగి చూడాలనే కుతూహలం ప్రతి మనిషి కి వుంటుంది, కుమార్ విషయంలో యిది యింకాస్త ఎక్కవనే చెప్పాలి.ఆ కుతూహలమే కుమార్ ని నాలుగు రోజులకు బదులు మరో నాలుగు రోజులు అక్కడే వుండేటట్టు చేసింది. బార్ యజమానితో మాట్లాడి రెండు రాత్రులు అరుంధతిని కొనుక్కొని, అట్టడుగు పొరలలో కరడుగట్టి మూగబోయిన మనస్సుని కరిగించి కన్నీరుగా ప్రవహింపజెయ్యగా అప్పుడు బయట పడింది అరుంధతి కథ.

మాలీవుడ్, టాలీవుడ్ లలో చిన్న,చిన్న పాత్రలలతో ప్రవేశించి,నటనలో కొత్త పాఠాలు నేర్చుకుంటూ చిత్రసీమలో దూసుకు పోతున్న అరుంధతికి రోజు రోజుకి నిశ్శత్తువగా అనిపిస్తోంది,దేనిపైనా ఆశక్తి వుండటం లేదు , చిటికి మాటికి చిరాకు కలుగుతోంది .ముఖం లోని నీరసాన్ని మేక్ అప్ కుడా దాచలేక పోతోంది .ఈ మార్పు ముందుగా పసికట్టింది ఆమె సహ కళాకారులు.వారి సలహానుసరించి పని నుంచి వో వారం రోజులు శలవు తీసుకుంది ,అయినా ఫలితం కనిపించ లేదు . రోజు రోజుకి ఆరోగ్యం క్షీణిస్తోంది, ఒక గంట పనిచేసినా అలసటగా వుంటోంది.ఆహారపు అలవాట్లు మార్చినా ఫలితం శూన్యం. సెలెబ్రిటీ కాబట్టి డాక్టర్ దగ్గరికి అందరిలా స్వేచ్చగా వెళ్ళలేక నిర్మాతలకి ఇచ్చిన షెడ్యుల్ పూర్తి చేసుకొని ఈ దేశం లో టెస్ట్ చేయించుకుంటే తెలిసింది పిడుగులాంటి వార్త . సినీ పరిశ్రమలో పేరు తెచ్చుకోవాలనే తపనే తప్ప మరో బలహీనత లేని అరుంధతి కి ఈ ముదనష్టపు జబ్బు ఎలా వచ్చిందో అర్ధం కాక మెదడు మొద్దుబారింది .ఆ షాక్ లో నుంచి కోలుకోక ముందే ఆమెకి అత్యంత విశ్వాసపాత్రుడు ,మంచి మిత్రుడు అని నమ్మిన మేనేజర్ కాయితాలమీద సంతకాలు చేయించుకొని వెళ్ళినవాడు మరి తిరిగి రాలేదు . వెనక్కి వచ్చి పువ్వులు అమ్మిన చోట కర్రలు అమ్మలేక ,చేతిలో డబ్బులేక ,తిన్నా తినకపోయినా మందులు మాత్రం వాడుతూనే వుండాలి ,లేక పొతే ఈ జబ్బు మీదపడి కొంచం కొంచంగా మృత్యువుకి దగ్గరగా చేరుస్తుంది కాబట్టి , చెయ్యడానికి మరో పని ఈ దేశం లో లేక,రాక ఈ వృత్తి లో స్తిరబడింది .

జబ్బు పేరు వినగానే కుమార్ ఒక్కసారి దిగ్భ్రాంతికి లోనయ్యేడు. అరుంధతి ఆ మహమ్మారి బారిన ఎలా పడిందో అడగకుండా వుండలేక పోయేడు . కారణం విన్న కుమార్ పాపం అనుకోకుండా వుండలేక పోయేడు . అందరు ఆడవాళ్ళకి వుండే బలహీనతే ఆమెకూ వుంది అదే అందంగా కనపించాలనే కోరిక , పరిశ్రమలో అడుగు పెట్టిన కొత్తలో అందానికి మేక్ అప్ లో మెరుగులు దిద్దుకోనేది, పేరు డబ్బు రావడంతో శాశ్వత మెరుగులు దిద్దించుకొనేందుకు ఇలాంటి శస్త్రచికిత్సలకి పేరుగాంచిన దేశంలో శస్త్రచికిత్స చేయించుకుంది. ఆ సమయంలో జరిగిన అలక్ష్యం వల్ల దాపురించింది హెచ్.ఐ .వి పాజిటివ్ .

అరుంధతి కధని సెన్సేషనల్ న్యూస్ గా వార్తా పత్రికలకి , టి.వి వాళ్లకి యిచ్చి డబ్బు , పేరు సంపాదించవచ్చు , కాని కుమార్ అంతరాత్మ దీనికి వప్పుకోలేదు . ప్రజలకి వుపయోగపడే విషయాలని వార్తలుగా చెయ్యొచ్చుగాని, విధివంచితల, బాధితుల కన్నీళ్ళను వార్తలుగా చేసి ఆకన్నీటి కూటితో ఆకాశనికెగరకూడదని నిర్ణయించుకున్నాడు కుమార్ . ఆ దేశపు జ్ఞాపకాలకు అక్కడే అంత్య క్రియలుచేసి స్వదేశానికి తిరిగి వచ్చేడు కుమార్.

మనసు మాత్రం అరుంధతి చుట్టూరా తిరగసాగేయి . ఆమె మనసు పొరలలో దాచుకున్న జ్ఞాపకాలను కదిలించి తను సాధించిపెట్టిన దేమిటో అర్ధం కాలేదు కుమార్ కి . అరుంధతి కథ నలుగురికి తెలియజేసి మిగతా వారిని రక్షించే బాధ్యత దేశ పౌరుడిగా , ఓ పత్రికారునిగా తనపై వున్న సంగతి కుమార్ కి తెలుసు అందుకే అరుంధతి పేరు బయటకి రాకుండా ప్రజలను యెలా అప్రమత్తం చెయ్యాలా అనే ఆలోచనలో మునిగిపోయేడు కుమార్ .

మార్కెట్ లో రోజుకో పేరుతో కుప్పతెప్పలుగా వస్తున్న సౌందర్యసాధనాల ప్రకటనలు తప్పుతోవ పట్టిస్తున్న తరుణం లో కుమార్ 'మసకబారిన నక్షత్రం '      యెవరిలోనైనా మార్పును తెస్తుందా ? , మనిషి ఆశాజీవి , వస్తుంటే అనుకుందాం .




నమ్మబుద్ధి కావట్లేదు రా! నేను అసలు తన గురించి అలా మాట్లాడానంటె నాకస్సలు నమ్మబుద్ధి కావట్లేదు!' అని బాధతో అన్నడు అంకిత్.

'నేను చెప్పింది ఇంకా చాలా తక్కువ రా...నిన్న రాత్రి నువ్వు అసలు తనని అన్న మాటలు తను గనకా విని ఉంటే ఈపాటికి చచ్చిపోయుండేది. నీకేంటి... అసలు నాకే నమ్మబుద్ధి కావట్లేదు!' అని అన్నాను.

మాటల్లోనే అంకిత్‌కి తన నుంచి ఫోన్ వచ్చింది. ఓ అర నిమిషం పాటు ఆలోచించి కళ్ళు తుడుచుకుని, ఫోన్ కట్ చేశాడు అంకిత్.

'ఎత్తి వుండాల్సింది..' అన్నాడు.

'ఎవరో చెప్తే వినకపోవచ్చు కాని, నాకు నేనే చెప్పుకున్నప్పుడు కూడా వినకపోవడంలో అర్థం లేదు రా..వెళ్ళొస్తాను'' బాధతో అని బయలుదేరబోయాడు.

'జాగ్రత్త రా…' అని అంటూ అంకిత్‌ని హగ్ చేసుకున్నా.

'థ్యాంక్స్ రా! జీవితంలో నాకు ఎప్పుడు అవసరమొచ్చినా నాకు తోడున్నది రెండే. ఒకటి నువ్వు.. రెండోది మందు.' అని అన్నాడు అంకిత్.

'అది సరే కాని, తను నాకు ఫోన్ చేస్తే నేనేం చెప్పాలి మరి?' అని అడిగాను.

'నువ్వు కూడా ఫోన్ ఎత్తకు..' అని జవాబిచ్చాడు అంకిత్.

***

రెండు రోజుల తర్వాత.

రోడ్ పక్కన నిలబడి అప్పుడే సిగరెట్ వెలిగించబోతూ ఉండగా..

'మణి!'

నేను వెనక్కి తిరిగి చూడగానే కళ్ళనీళ్ళు పెట్టుకున్న స్వాతి కనబడింది. వెంటనే నా సిగరెట్ కింద పడేసి కాలితో తొక్కేసా. 'స్వాతి.. ఎలా ఉన్నవ్?' ఏం మాట్లాడాలో తెలియక అడిగేశా.

‘ఎలా ఉన్నానో నీకు తెలీదా?’ అని వెంటనే ఏడవడం మొదలుపెట్టింది.

స్వాతిని ఏడుస్తుండగా చూడడం అదే మొదటిసారి. చాలా బాధేసింది.

‘ఏడవకు స్వాతి… అందరూ చూస్తున్నారు ప్లీజ్’ అంటూ సద్దిచెప్పబోయాను.

‘ఎలా ఉన్నాడో తెలియదు. ఫోన్ ఎందుకు ఎత్తడో తెలియదు. ఫేస్‌బుక్.. వాట్సాప్.. అన్నిచోట్లా బ్లాక్ చేశాడు. కనీసం నీకు ఫోన్ చేసి తెలుసుకుందామంటే నువ్వు కూడా అంతే!’ అంటూ కుమిలి కుమిలి ఏడవసాగింది స్వాతి, ‘నేనేమనుకోవాలి మణి? చెప్పు..’

‘స్వాతి. వాడినింక మర్చిపో’

‘ఎలా మణి? మూడేళ్ళుగా ప్రేమించుకుంటున్నాం. ఏవో చిన్న చిన్న గొడవల వల్ల ఇలా వదిలేసుకుంటారా?’

‘నీకు అవి చిన్న చిన్నవే స్వాతి… కాని వాడికి కాదు. వాడికి నీకు నచ్చినట్టు ఉండడం అసాధ్యం అనిపిస్తుంది.’

‘నేనేమైనా నాకోసం చెప్పానా? వాడికోసమేగా చెప్పింది! అయినా ప్రేమించిని వాళ్ళ కోసం చిన్న చిన్న సర్దుబాట్లు తప్పదు’ అని గట్టిగా అరిచింది స్వాతి.

‘అవును. కాని వాడు నిన్ను ప్రేమించట్లేదు!’

‘అని అంకిత్ నీకు చెప్పాడా?’

‘అవును’

‘నేను నమ్మను!’

‘నిజం స్వాతి. నేను నీకెందుకు అబద్ధం చెప్తాను. నాకు వాడెంతో నువ్వూ అంతే. మొన్న బార్ లో కూర్చునుండగా వాడే నాకు చెప్పాడు. అంతే కాదు. ఇంకా చాలా చాలా చెప్పాడు స్వాతి. వదిలెయ్.’

‘తాగాక వంద అంటారు మణి… అవన్నీ పట్టించుకుంటామా? అయినా నేను వాడిని తాగుడు మానేయమని చెప్తే, నువ్వు కూడా వాడితో తాగావా?’

‘నేనేం తాగలేదు స్వాతి. అంకిత్ కి ఓ సిద్ధాంతం ఉంది. వాడికి ఎప్పుడు జీవితంలో ఏం చెయ్యాలో తెలియకపోయినప్పుడు, నన్ను వాడితో పాటూ బార్ కి తీసుకెళ్తాడు. తాగిన తర్వాత వాడు ఏం అంటాడో మరుసటి రోజు లేవగానే మర్చిపోయాక, నేను వాడికి వాడి మాటలే తిరిగి చెప్తాను.

దాని ప్రకారంగానే వాడు నిశ్చయించుకుంటాడు. తాగాక నిజాలే మాట్లాడతారన్న ఓ నమ్మకం ఉంది చూడూ.. అలానే.. అంకిత్ నమ్మకం ఏంటంటే, మనకి ఏం చెయ్యాలో తెలియని అనిశ్చితస్థితిలో తాగి మాత్రమే నిశ్చయించుకోవచ్చని. నువ్వేమో తాగుడే .మానేయమన్నావు. అది వాడి వల్ల కాక నిన్ను వదిలేద్దామని నిశ్చయించుకున్నాడు.’ అని వివరినిచ్చాను.

ఓ నిమిషం పాటు తను మౌనంగా ఉంది. ఏడుపాపేసింది.

‘అర్థమైంది’ అంటూ కళ్ళు తుడుచుకుని, ‘నేను ఇంక అంకిత్ చెడిపోవడానికి కారుణం వాడే అనుకున్నా. కాని అది వాడు కాదు.. నువ్వు’ అని వేలెత్తి చూపుతూ చెప్పింది స్వాతి.

నాకేం అర్థం కాలేదు.

‘నేనేం చేశా?’ అని అడిగా.

'ఒక మనిషి స్పృహలో ఉంటేనే ఏం మాట్లాడుతున్నాడో, అది ఏ భావంతో అంటున్నాడో తెలియదు. అలాంటిది మద్యం తాగాక మన స్పృహలోనే ఉండరు. అలాంటప్పుడు నిజాలే మాట్లాడతారని నువ్వు ఎలా చెప్పగలవు? అంకిత్ ఇలా వారానికి మూడు సార్లు తాగి చెడిపోతూంటే నేను బాధపడి నిన్ను హెల్ప్ చెయ్యమంటే, నువ్వు వాడిని ఇంకా ప్రోత్సాహిస్తున్నావా? ఇప్పుడు విను. వాడు ఈ జీవితంలో ఎప్పుడు ఏ తప్పుడు నిర్ణయం తీసుకున్నా అది నీ వల్లే! మా బ్రేకప్ కూడా..' అంటూ వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది స్వాతి.

నేను మాత్రం అక్కడే, అలానే, నుంచునుండిపోయాను.

***

రాత్రి పన్నెండు.

నిద్ర పట్టట్లేదు.

కళ్ళు మూసుకున్న ప్రతి సారి స్వాతి మాటలు వినిపించింది. తను కళ్ళనీళ్ళు పెట్టుకున్న దృశ్యం అసలు వదలట్లేదు. ఎక్కడో గుండెలో ఏదో బరువు పెరిగినట్టు అనిపిస్తుంది. ఒక స్నేహితుడుకి సహాయం చేద్దామన్న ఉద్దేశ్యంతో నేనుంటే, ఇప్పుడు మొత్తం అపరాధం నా వల్లే జరిగిందనిపిస్తోంది. సరిగ్గా అప్పుడే నా ఫోన్ మోగింది. అంకిత్.

'సారి రా...నువ్వు పడుకుని ఉంటావని తెలుసు... కాని..' అని అంకిత్ అంటూ ఉండగానె,

'నేనేం పడుకోలేదు రా!' అని అన్నాను.

'అదేంటి? పదింటికే పడకేసే నువ్వు పన్నెండైనా పడుకోలేదా?' అని అడిగాడు ఆశ్చర్యంగా.

'నిద్ర పట్టట్లేదు రా!'

‘ఏ?’

‘జీవితంలో మొట్టమొదటిసారి నేను అనిశ్చితస్థితిలో ఉన్నా రా! అసలు…ఏం చెయ్యాలో కూడా అర్థం కావట్లేదు!’ అన్నాను బాధతో.

‘ఇలాంటప్పుడే ఏం చెయ్యాలో తెలుసా?’ అని అడిగాడు అంకిత్.

‘ఏంటి?’ అని అడిగాను నిరాసక్తంగా…

***

మరుసటి రోజు.. మధ్యాన్నం గం.1:30 లు.

నిద్ర లేవడంతోనే విపరీతమైన తలనొప్పి. లేచి ఏం చెయ్యాలో తెలియక తల పట్టుకుని కూర్చున్నా. అప్పుడే నాకు నా పక్కనే అంకిత్ పడుకుని ఉండి కనబడ్డాడు.

వెంటనే అంకిత్ నిన్న అర్ధరాత్రి నన్ను బార్ కి తీసుకెళ్ళడం… నేను సౌండ్ రికార్డర్ ఆన్ చేసి, ఇద్దరం విపరీతంగా తాగడం లీలగా గుర్తొచ్చింది. వెంటనే నా ఫోన్ తీసుకుని, నిన్న రాత్రి మేము రికార్డ్ చేసుకున్న ఆ ఆడియో ని వినసాగాను…

అంకిత్ : నేను గందరగోళంలో ఉన్న ప్రతి సారి మణి నాకు హెల్ప్ చేశాడు. కాని మొదటిసారి మణికి ఏదో సమస్య వచ్చింది. అందుకే నేను ఈ సిట్టింగ్ ప్లాన్ చేశా. ఈ సారి మేమిద్దరం తాగబోతున్నాం కాబట్టి.. తాగి మనం ఏం మాట్లాడుకున్నామో మర్చిపోతాము కాబాట్టి, ఈ సౌండ్ రికార్డర్ ఆన్ చేసి చీర్స్ కొట్టబోతున్నాం..

ఒ ఐదు నిమిషాల పాటు ఏ మాటలూ వినిపించలేదు... ఇక మెల్లగా అంకిత్ మాటలు నాకు మత్తు మత్తుగా వినిపించింది.

అంకిత్ : మణి... ను..వ్వు నా బెస్ట్ ఫ్రెండ్ మణి... నీకంటె..నాకు ఎవ్వ..రూ ఎక్కువ కాదు.. స్వాతి అయినా సరే.. చెప్పు.. ఏంటి నీ సమస్య?

మణి : ఒరేయ్.. నువ్వు స్వాతిని బానే వదిలేసావ్.. కాని ఓ మూడు రోజుల తర్వాత... స్వాతి నన్ను కలిసింది... చా..లా బాధ పడింది రా.. ఏడుస్తూ.. ఏడుస్తూ.. ఏమందో తెలుసా? నిన్ను నేనే తప్పుదోవ పట్టిస్తున్నానంది.. నువ్వు ఇలా తాగి నిర్ణయాలని తీసుకోవడం తప్పని.. దానిని ప్రోత్సహించడం నా తప్పని.. నువ్వు తీసుకునే ప్రతి తప్పుడు నిర్ణయానికి కారుణం నేనే అని తిట్టింది.. నేనేదో నీకు సాయం చేద్దామని ఇదంతా చేస్తుంటే, చివరికి... చివరికి.. తప్పంతా నాదే అన్నట్టు చెప్పింది రా... అందుకే... నేను నిన్ను అడిగి తెలుసుకుందామను కుంటున్నా..          స్వాతి కరెక్టా? నువ్వు కరెక్టా?

అంకిత్ : (గట్టి గట్టిగా నవ్వుతూ..) ఒరేయ్.. స్వాతి కరెక్ట్ రా. మనం జీవితంలో ఏ నిర్ణయమైనా ఆలోచించి తీసుకోవాలి కాని, మద్యం తాగి స్పృహలో లేకుండా తీసుకుంటామా? అందుకే.. తను చెప్పిందే కరక్ట్..

మణి : మరి.. అది తప్పని తెలిసినప్పుడు కూడా ఇంకా ఎందుకురా ఇలా?

అంకిత్ : ఎందుకంటే, జీవితం అన్నది ఆగదు కాబట్టి. నేను నిర్ణయాలు తీసుకోవడంలో చాలా బలహీనుణ్ని. నాకంటూ ఏది సరైనదో, ఏది కాదో కూడా తెలుసుకోలేను. కాని, ఏ నిర్ణయం తీసుకోకపోవడం కంటే, ఏదో ఓ నిర్ణయం తీసుకోవడమే మేలు కదా! ఎంత సేపని అదే గందరగోళంలో ఇరుక్కుని ఉండాలి? అందుకే... నాకంటూ నేను పెట్టుకున్న సిద్ధాంతమే ఇది! ఇది తప్పు కావచ్చు... కాని నాకు మాత్రం ఇది సరైనదే! ఇది అబద్ధం కావచ్చు... కాని నాకు మాత్రం ఇది నిజమే!

ఓ అరనిమిషం పాటు నాకు మా మాటలేవీ వినిపించలేదు..

అంకిత్ :       నీ కన్ఫ్యూషన్ తీరినట్టేనా?

మణి : ఆఁ..

అంకిత్ : కాని...కాని నాకు నువ్వో సాయం చెయ్యాలి రా...

మణి : చెప్పు..

అంకిత్ : రేపు పొద్దున్న నేను లేచాక, ఈ ఆడియో నాకు వినిపించకు. ఇప్పటివరకూ నేను తీసుకున్న నిర్ణయాలన్నీ తప్పుడు నిర్ణయాలయ్యుండచ్చని నాకు తెలిస్తే, నేను ఇంక జీవితంలో ముందడుగు వెయ్యలేను! అందుకే.. నా అబద్ధాన్ని నాకు నిజంగానే ఉండనివ్వు...

మణి : స..రే....!

అంకిత్ : లవ్ యూ రా! నాన్ను ఎవరైన అర్థం చేసుకునేవాళ్ళు ఉన్నారంటే అది నువ్వే! నువ్వు లేకపోతే అసలు నా జీవితం ముందుకి సాగదు..

వెంటనే అంకిత్ నిద్రలేస్తూ ఉండడం చూసి ఒక్కసారిగా రికార్డర్ ని ఆపేశా. అంకిత్ కళ్ళు నలుపుకుంటూ నా వైపు చూడసాగాడు..

'గుడ్ మార్నిం...ఓహ్...గుడ్ ఆఫ్టర్నూన్ రా'


'గుడ్ ఆఫ్టర్నూన్ రా'

'ఏమైంది రా? లేవడం లేవడం సౌండ్ రికార్డర్ పట్టుకుని కూర్చున్నావ్?' అని ఏదో గుర్తురాగా, 'ఓహ్... అన్నట్టు... నిన్న మనం సిట్టింగ్ వేసాం కదా? సిట్టింగ్‌కి ముందు రికార్డర్ ఆన్ కూడా చేశాము... ఏది... నాకు వినిపించు' అని ఆసక్తిగా ఒక్కసారి లేచి కుర్చున్నాడు అంకిత్.

ఓ పక్క స్వాతి మాటలు గుర్తొచ్చాయి- 'వాడు ఈ జీవితంలో ఎప్పుడు ఏ తప్పుడు నిర్ణయం తీసుకున్నా అది నీ వల్లే!', మరో పక్క వీడి మాటలు- 'నన్ను ఎవరైన అర్థం చేసుకునేవాళ్ళు ఉన్నారంటే అది నువ్వే! నువ్వు లేకపోతే అసలు నా జీవితం ముందుకి సాగదు..'

ఇప్పుడు నేను ఆ రికార్డింగ్ అంకిత్‌కి వినిపించాలా వద్దా?

(కారణం ఏదైనా మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరం) -




కుర్చీలో తీరుబడిగా కూర్చుని,పొటాటో చిప్స్ తింటూ,టివి చూస్తున్న శేఖరం ,ఏదో శబ్దం కావడంతో గుమ్మం వైపు చూశాడు.ఎవరో తలుపుకొడుతున్నట్టనిపించి వెళ్ళి తలుపు తీశాడు.ఎదురుగా తన స్నేహితుడు మూర్తి.చూసి చూడగానే,ముఖం విప్పార్చి,చిరునవ్వుతో, ఒరేయ్ మూర్తీ నువ్వా.ఎప్పుడొచ్చావ్ హైదరాబాద్ నుండి.అడిగాడు లోనికి ఆహ్వానిస్తూ.

నిన్ననే వచ్చాన్రా .మా మనవడి మొదటి పుట్టినరోజుకి రమ్మని మా అమ్మాయి ఫోన్ చేస్తే వచ్చాను.మా అబ్బాయి బిసినెస్ పనిపై డెల్లి వెళ్ళాడు.లేదంటే వాడే వచ్చేవాడు.నేను విశ్రాంతి తీసుకునేవాడ్ని.వయసు కదా.కాలంతో పెద్ద సాగలేను.అని చెప్తూ వచ్చి, హాల్లో సోఫాలో కూర్చున్నారు మూర్తిగారు.

అవునులే. కొడుకు నీడన ఉంటూ, హాయిగా విశ్రాంతి జీవితం గడుపుతున్నావ్.అయినా,అలా మరీ ఖాళీగా కూడా ఉండకూడదు. అప్పుడపుడైనా ఇలా రాకపోతే ఎలాగూ.

ఖాళీనా?భలే వాడివేరా బాబూ.పొద్దున పాలపేకెట్లు తేవడం,నా మనవరాల్ని స్కూల్లో దిగబెట్టడం,సూపర్ బజార్ కు వెళ్ళడం, కాయగూరల కోసం రైతు బజారుకు వెళ్ళడం ,సాయంత్రం మళ్ళీ నా మనవరాల్ని స్కూల్ నుండి తీసుకు రావడం.ఇలానే నెమ్మదిగా ఓ రోబోలా పని చేస్తుంటే,నన్ను ఖాళీగా ఉన్నానంటావా.అడిగాడు సూటిగా చూస్తూ.

ఆ మాటలు విన్న శేఖరం,ఛీ,ఛీ సిగ్గులేదూ.అన్ని పనులు చేయడానికీ ,మళ్ళీ వాటిని నిస్సిగ్గుగా చెప్పడానికీనూ.అసహనం వ్యక్తం చేసారు శేఖరం గారు.

అదేంట్రా అలా అంటావు.అక్కడికి నేనేదో పెద్ద కాని పని చేసినట్టు.అయినా నువ్వూ రిటైరైన వాడివేగా.నువ్వూ ఇంట్లో అడపా దడపా పనులు చేయవా ఏంటి.మరీ విడ్డూరంగా మాట్లాడతావ్ అడిగారు మూర్తి గారు.

నీలా నేనా.ఛ ఛ,నేనంత చచ్చు కాదు.నా కోడలు,కొడుకు నాతో మాట్లాడడానికే పదాలు వెతుక్కుంటారు.ఇక నాకు పనులు చెప్పడమా,అది వారి దృష్టిలో పెద్ద సాహసం.అంత భయం,భక్తి ,గౌరవం నేనంటే.నీకోటి చెప్పనా.మనం రెటైర్ అయిపోయాకే మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి.ఎందుకంటే,రెటైర్ అయిపోయాడు కదా అనే చులకన భావంతో మనల్ని పూచిక పుల్లల్లా తీసిపారేయగలరు.అందుకే ,మావాడు కాని మా ఆవిడ కానీ ఓ సలహా చెప్పే ముందే వారి మొహం వాచేలా చివాట్లు పెడతాను.లేకపోతే,అదే అలుసనుకుని మొదట సలహాగా ప్రారంభమై తర్వాత ఆర్డర్లివ్వడం వరకూ వెళ్తారు.అందుకే ఆదిలోనే వారిని అదుపులో పెట్టాలి.తెలుసుకో.కనుక నువ్వూ నాలా ఉండు. చెప్పారు శేఖరం గారు.

మరీ విడ్డూరంగా మాట్లాడుతున్నావురా శేఖరం .నేను నీలా ఉండాలా.ఎందుకూ.నా కుటుంబ సభ్యులపై నేనే పెత్తనం చేయడానికా.లేక వాళ్ళని పెద్దరికం పేరుతో పొడుచుకు తినడానికా.లేదురా. నేనలా ఎప్పటికీ ఉండలేను.అయినా ఇప్పుడు నేను చేదోడు సాయం చేస్తోంది ఎవరికి.నా కొడుక్కి,కోడలికి,మనవరాలికే.అయినా వాళ్ళకి నేను కాకపోతే ఎవరు చేస్తారు.నేను కొంచెం ఇబ్బంది పడ్డా పర్వాలేదు,నా అనుకున్న వాళ్ళని సంతోషంగా ఉంచాలనుకుంటాను, ఉండాలనుకుంటాను.కనుక నేను ఇలానే ఉండిపోతాను.అయినా మనం ఎన్నో చూసి ఈ వయసుకు వచ్చిన వాళ్ళం.మనం పిల్లల్ని దిద్దాలి కానీ వారిపై యుద్ధం చేయకూడదు.నేను వయసులో ఉన్నపుడు మా నాన్నని స్కూటర్ కొనమని ఎంత పోరినా కొనలేదు.చివరికి నేను ఉద్యోగంలో చేరగానే లోన్ పై కొనుక్కున్నాను.మా నాన్నకి కోపం వచ్చి ఓ రోజు మాట్లాడలేదు.తర్వాత ఓ హెల్మెట్ కొనిచ్చి,నలభై స్పీడు లోనే నడుపు.ఎప్పుడూ హెల్మెట్ పెట్టుకో లాంటి ఎన్నో జాగ్రత్తలు చెప్పి,నాకు డబ్బు ఇచ్చి లోన్ క్లియర్ చేసేయమన్నారు.అప్పుడు అర్ధమైంది ఆయన మనస్సు.కనుక మనం పిల్లలతో విభేదిస్తే,దానికి ఓ మంచి కారణం ఉండాలి.వారిని మనం చెప్పిన మాటే వినాలని కట్టడి చేయాలనుకున్నపుడు , దాని వెనుక ఓ బలమైన కారణం ఉండి తీరాలి.అంతే కానీ, మన మాటే చెల్లాలన్న అహం,నేను చెప్పినట్టే జరగాలనే పెద్దరికపు పట్టుదలలు మంచివి కావు. ఓర్పు కావాలి శేఖరం.అప్పుడే భంధాలు బలపడతాయి.లేకపోతే బరువైపోతాయి.మన నుండి పారిపోవాలనిపిస్తుంది.మనం వారికి చేయూత అయి నడిపించాలి కానీ గుప్పిట్లో పెట్టుకోవాలనుకోకూడదు.మనం కూడా ఆ వయసులో ఇంచు మించు అలానే ఉండేవాళ్ళం కాదా.కనుక అజమాయిషీ వద్దురా

చెప్పారు మూర్తిగారు.

నీకింకా చాదస్తం పోలేదు రా.అందుకే ఇలా మాట్లాడుతున్నావ్.నేను ఎంత అజమాయిషీ చేసినా నా కొడుకు నా కొడుకే . నేనంటే అదే ప్రేమ.లేదంటే, నన్ను వదిలి బెంగళూరు వెళ్లడానికి తెగ ఇదై పోయాడు.కోడలు అయితే మరీనూ.ఇక మా ఆవిడ నేను రెటైర్ అయ్యాక జీతం తగ్గుతుంది కనుక, మీరు ఇన్నాళ్లూ కష్టపడ్డారు కనుక, నేను ఉద్యోగం చేస్తా అని ఓ పత్రికలో ఎడిటర్ గా పనిచేస్తోంది.నేను వారిపై అజమాయిషీ చేసినా వారు దాన్ని క్రమశిక్షణ అనే అనుకుంటారు.అదీ మా మధ్య అనుబంధం.అయినా నీ కోడలు,కొడుకూ నిన్నో రోబో లా చూస్తున్నారని నా నమ్మకం.నువ్ లేకపోతే ఎలా ఉన్నావ్ అని కనీసం ఆలోచించరు అని నా విశ్వాసం.చెప్పాడు తేలికగా.

సరేలే శేఖరం.నేను నా ధర్మం నేను నిర్వర్తిస్తున్నాను.చేసిన దానికి ప్రతిఫలం ఆశించను.వారికి ఏది నచ్చితే అదే నాకూ నచ్చుతుంది.కారణం వారు బాధ పడకూడదు.కానీ జాగ్రత్తలు చెప్తాను. శ్రుతిమించనంత వరకూ నా కుటుంబసభ్యులతో నేను ఓ స్నేహితుడిని.ఏమైనా నువ్ కొంత కఠినంగా ఉన్నా నీ కుటుంబ సభ్యులు ఓపిగ్గా ఉండటం ఇక్కడ మంచి విషయం.సరే కానీ, చెల్లెమ్మతో మాట్లాడి చాలా రోజులైంది.ఉండు ఓ సారి ఫోన్ చేస్తాను అంటూ శేఖరం భార్యకి కాల్ చేసి స్పీకర్ ఆన్ చేశాడు.మూడవ రింగ్ కి ఫోన్ లిఫ్ట్ చేసింది శేఖరం భార్య లక్ష్మమ్మ .

ఆ, చెల్లెమ్మా ,ఎలా ఉన్నావ్.


ఏం ఉండటంలే అన్నయ్యా.అలాగే. చెప్పిందామె నీరసంగా.

భలే దానివేనమ్మా.అంత చేస్తూ, ఇంత సాధారణంగా మాట్లాడుతున్నావంటేనే తెలుస్తోందమ్మా నీ గొప్పదనం.లేదంటే భర్త రిటైరైన తర్వాత ,అతని పెన్షన్ ,మరియు అవసరాలు గ్రహించి, ఇలా నువ్వు ఈ వయసులో ఉద్యోగానికెళ్తున్నావ్.

భలే వాడివే అన్నయ్యా.నీకలా అర్థమైందా.ఆయన ఉద్యోగం చేస్తూ ఆ మాత్రం సమయం ఇంట్లో ఉంటేనే,ఆయన అజమాయిషీతో నన్ను కబడ్డీ ఆడేవారు.అలాంటిది ఇపుడు ఆయన రెటైర్ అయ్యారు.రోజంతా ఇంట్లో ఉంటే నన్ను చెడుగుడు ఆడేస్తారు.అందుకే ఆయనికి ఆమాట ,ఈమాట చెప్పి ఇలా ఉద్యోగం చేస్తూ కొంత మనశ్శాంతిగా ఉంటున్నాను.ఈయన అజమాయిషీ భరించలేక కొడుకూ,కోడలూ బలవంతపు ట్రాన్స్ ఫర్ పెట్టుకుని బెంగళూరు పారిపోయారు.వాళ్ళు ఉన్నన్నాళ్లు ,వారిపై అన్నిటికీ ఆంక్షలే.ఆఖరికి,కొడుకు ఆఫీసు నుండి ఆలస్యంగా వచ్చినా,కోడలు పొద్దునే నిద్ర లేవకపోయినా,అతిథులకి టీ ఆలస్యంగా తెచ్చినా, చెడా మడా తిట్లు.ఆయన మాటే వేదం అంటారు.ఏవిటో .చెప్పిందామె.బరువైన స్వరంతో. ఫోన్ స్పీకర్ ఆన్ లో ఉండడంతో ,తర్వాత చేస్తానమ్మా.అంటూ ఫోన్ పెట్టేశారు మూర్తిగారు.

ఆ ఫోన్ కాల్ విన్న శేఖరం ఆలోచనలో పడ్డాడు.

వస్తానురా అని కదలబోయిన మూర్తిగారికి ఫోన్ రావడంతో లిఫ్ట్ చేసి,అమ్మా వచ్చేస్తున్నాను.ఆ బానే ఉన్నాను.అబ్బాయి అడిగాడా .సరే .లేదు చక్కర టీలో కూడా వేసుకోవడం లేదు.వచ్చేస్తానమ్మా అని ఫోన్ పెట్టేసి, నా కోడల్రా   అని చెప్పి, మనుషులని గెలవాలంటే ఓర్పు కావలి.కొన్నిటికి ఓర్చుకోవాలిరా శేఖరం .అజమాయిషీ కాదు.ఇప్పటికైనా తెలుసుకో,నీ వారిని దగ్గర చేసుకో. చెప్పి బయటకు నడిచాడాయన.




“వార్త విన్నారా?”

కాఫీ కప్ అందిస్తూ..అప్పుడే ఆఫీస్ నుండి వచ్చి రిలేక్స్ అవుతున్న ప్రకాష్ ని అడిగింది..అనసూయ.

“వార్త చదివావా?అనాలిగానీ వినడమేమిటి ?”

భార్యామణి అంతరంగాన్ని అర్థం చేసుకోలేని ప్రకాష్ అయోమయంగా భార్య ముఖాన్నే చూస్తూ కాఫీ సిప్ చేసాడు.

“చదవడానికి ఇదేమి జ్యోతి ఈనాడు వార్తకాదు స్వామి ..వినే వార్తే.”

“అయితే వినిపించు .వింటాను.M.I.M గురించి కాదుగా?”

“M.I.M అంటే ?”

“మోడీ ,మెట్రో,మధ్యలో ఇవాంక..ఇదేగా నేటి కారం వార్త?”

“కారం వార్తా ?”

“అదే ..హాట్ న్యూస్ .”

“అయితే యిది M.K.M వార్తన్నమాట .”

“మధ్యలో ఐ బదులు కె ఎక్కడనుండి వచ్చిందబ్బా?”

“K..అంటే కాత్యాయినీ ఫ్రం కంకిపాడు.”

“నిజమా ? మా చెల్లాయి వస్తోందా?ఎప్పుడు?ఎవరుచెప్పారు?” ఉత్సాహంగా అడిగాడు ప్రకాష్.

“తెలియనట్లు నటించకండి.నా సెల్లుకు మెసేజ్ పెట్టిన తల్లి మీ సెల్లుకు మెసేజ్ పెట్టలేదంటే నేను నమ్మాలి?”

“పెట్టిందేమో నేను వేరే బ్రాంచ్ ఇన్స్పెక్షన్ లో వున్నాను.సెల్లు ఆఫీస్ లోనే వదిలేసాను.”

సెల్లు చూసుకుంటు చెప్పాడు.

“నమ్మమంటారా?”

“నామాటలు ఎప్పుడు నమ్మావు నువ్వు?నిన్ను నేను నమ్మించలేను గాని ..యింతకీ మెసేజ్ ఏమిటి?”

“వివరాలేమీ లేవుగాని అందుకే అయ్యుంటుందని అనుకుంటున్నాను.”

“అందుకే అంటే?అదేమిటో చెప్పరాదా..ఇవ్వాళ పూర్తిగా అలిసిపోయాను.బుర్ర తినకు ప్లీజ్ ..” ప్రాధేయ పడ్డాడు ప్రకాష్.

“వయసొచ్చిన అమ్మాయి తల్లి వయసొచ్చిన అబ్బాయి తండ్రి దగ్గరకు ఎందుకు వస్తుంది?”

“ఓ..నువ్వు ఆరూట్లో వచ్చావా?మన బడుద్దాయికి అంత అదృష్టమా?అవిక ఎక్కడ మనరాజా ఎక్కడ?”

“వాడిని బడుద్దాయి అనకండి.”

“మరేమనమంటావు?అత్తెసరు మార్కులతో బిటెక్ అయ్యిందనిపించాడు. వుద్యోగం సంపాదించుకో లేక వూరు మీద పడ్డాడు. మరి కాత్యా కూతురు ?అందానికి అందం ..అణకువ..నువ్వన్నట్లు సంబంధం కోసమే వస్తే మాత్రం మనరాజా అదృష్టవంతుడే”

“ఇక ఆపండి.మీ చెల్లాయితో నేను మాట్లాడుతాను.మీరేమి జోక్యం చేసుకోకండి.

నాకొడుకుని చచ్చినా కాత్యాయిని కూతురికి కట్టబెట్టను." వార్నింగ్ యిచ్చింది అనసూయ.కూతురి కాలేజి ఫీజ్ కోసం సాయం కోరి వచ్చిన కాత్యాయిన్ని ఎన్ని మాటలందో గుర్తుకొచ్చి ఆనాటి తన అసమర్ధతకు తనను తానే అసహ్యించుకొని మౌనం పాటించాడు ప్రకాష్.

"అయినా మన అబ్బాయికి వుద్యోగం యివ్వాళ కాకపోతే రేపు ..మనం వూ అంటే కోటిరూపాయల కట్నంతో వచ్చే అమ్మాయిలు కోకొల్లలు."

"అవును మరి..నలుగువచ్చారు.వుద్యోగం లేదని పారిపోయారు.

అందమైన కలలు కనడానికి బాగుంటాయికాని..నిజజీవితంలో సాధ్యంకాదు.ఆకల చెదిరిపోతే మిగిలేది కన్నీరే."

"మీరెన్నైనా చెప్పండి.కానీ మీ చెల్లమ్మ విషయం లో మాత్రం తలదూర్చకండి.

ఆవచ్చే తల్లి తొందరగా వచ్చేడిస్తే బాగుణ్ణు .కుక్ వెళ్ళిపోతుంది."

"ఏ ..ఎన్నో రోజులతర్వాత వస్తోంది నువ్వామాత్రం చెయ్యలేవా?"

"చెయ్యక చస్తానా?..ఎందుకు చెయ్యను..రాత్రికి అమ్మగారి బస యిక్కడేనో..వెళ్ళి పోతుందో?"

"ఇంకా రాలేదు ..అప్పుడే పంపించే ప్రయత్నాలా?"

" రాక చస్తుందా?కాళ్ళకుపడ్డ పాము కరవకుండా వదులుతుందా?

మరోసారి చెపుతున్నాను ..మీ చెల్లమ్మ గారు చెమ్మగిల్లిన కళ్ళతో ..

అరే అన్నయ్యా !కట్నాలు ఇచ్చుకోలేను కనికరించి నా కూతుర్ని నీ కోడలిగా చేసుకోరా! అని చేతులు పట్టుకుంటే కరిగిపోయి సొల్లు కార్చొద్దు.నాకొడుకు పేరే కాదు వాడే రాజా.

నేను బాత్ రూంకెళుతున్నాను.వచ్చే లోపు కాత్యాయిని వస్తే పిచ్చి వాగుడు వాగకుండా కూర్చోండి."

"అలాగే అసూయమ్మగారూ!సారీ అనసూయా."

******

"రారా కాత్యా ..ప్రయాణం బాగా సాగిందా?"

"బాగానే సాగింది అన్నయ్యా .అసలు అవికా కూడా రావాలనుకుంది.ఏవో ట్రైనింగ్ క్లాసులు వున్నాయని రాలేకపోయింది."

"నువ్వొచ్చావు ..దాన్ని చూడడానికి నేనే వస్తాను.అమరావతి లో సాఫ్ట్ వేర్ కంపెనీ లో జాబ్ కదూ?"

"ఏదో చిన్న జాబ్."

"హాయ్ !కాత్యాయిని ..ఎంతసేపయ్యింది వచ్చి.?" అంటుకున్న తల తుడుచుకుంటు వచ్చి అడిగింది అనసూయ.

"యిప్పుడే వదినా ..అన్నట్లు రాజెక్కడ? జాబ్ చేస్తున్నాడా?"

మొన్నేదో ఇంటర్వ్యూ కెళ్ళాడు.మల్టీనేషనల్ కంపెనీ.రేపో మాపో అంటున్నాడు."

“నీకేమి వండిపెట్టాలా అని నీ మెసేజ్ చూసినప్పటి నుండి మీ వదిన    బుర్ర బద్దలు ..”

“వదిన సంగతి నాకు తెలియదా అన్నయ్యా?నువ్వు ప్రత్యేకంగా చెప్పాలా?”

“మీ అన్నయ్యే చెప్పాలి.నేను విని తరించాలి.

అవునూ ఒక్కదానివే వచ్చావే?అవిక రాలేదా?”

“అది మొన్నీ మధ్యే ఏదో చిన్న జాబ్ లో చేరింది.సెలవు పెడితే బాగోదని నన్ను పంపింది.”

“అవికా పెళ్ళి గురి౦చి ఆలోచిస్తున్నావా?”

“అమ్మాయి    పెళ్ళంటే మాటలావదినా?”

“అయినాతప్పదుగా ?అవికా వయసు ఇరవై నాలుగా ?ఐదా?”

“మొన్నే యిరవై నాలుగు దాటి యిరవై అయిదులోకి అడుగుపెట్టింది.”

“మీదగ్గరి బ౦ధువుల్లో చూడలేక పోయావా?”

“ఆపనిమీదే వచ్చాను.”

“మీ అన్నగారిని నమ్ముకోకు..అదుగో అంటే ఆరు ఇదుగో అంటే ఇరవై.. నెలలు కాదు సంవత్సరాలు.”

“ఏరా అన్నయ్యా?నీ మేనకోడలి కోసం నువ్వేమి చేయలేవా?”

“ఇంతచెప్పినా అర్ధం కాలేదా వదినా?ఖర్మ ఖర్మ.”

“నేనేమి చేయగలను చెప్పు?”

“అదేమి మాటన్నయ్యా?ఏమీ చేయలేవా?కనీసం రాజాకైనా ?”

“వదినా వాడికిప్పుడే పెళ్ళా?”

“ఇరవైయేడు దాటిపోలా?”

“అవుననుకో మొన్నీమధ్య ఓసంబంధం వచ్చింది..కానీ వాళ్ళు కోటికన్నా ఎక్కువ యివ్వలేమన్నారు.”

“వీర లెవెల్లో కోతలు కోస్తున్న భార్యను ఏమీ అనలేక మౌనాన్ని ఆశ్రయించాడు ప్రకాష్.”

“అన్నయ్యా !నిన్నడుగుతున్నాను..నీ సమాధానం కూడా యిదేనా?”

“వదినా నన్నడుగు.నేను చెపుతాను.మారాజాకీ మీ అవికాకి పోలికేలేదు. కట్నం యివ్వగలవా అంటే అదీలేదు.పోనీ మీఅమ్మాయి ఏమైనా మిస్ వరల్డా? చిన్నజాబని నువ్వే చెప్పావు.మరి యేమిచూసి రాజాని యిమ్మంటావు?”

“వదినా! డబ్బు దర్పాలని మించి అనుబంధముంటుంది.

నాకు వీడు అన్నయ్య.ఒకతల్లి బిడ్డలం.”

“అయితే?”

“కట్నాల పేరుతో కావలసిన వారిని దూరం చేసుకుంటామా?”

“వదినమ్మా!నీతులు చెప్పడానికి యిది కధకాదు..సినిమాకాదు..జీవితం.

నీతులు చెప్పడానికే గాని ఆచరించడానికి కాదు.”

“చివరిగా అడుగుతున్నాను .. మా అవిక మీ రాజాకి తగిన సంబంధం కాదంటావు?”

“అవును.. అవును.. అవును..ఒకే మాట ఎన్నిసార్లు అడుగుతావు?” ఆవేశపడిపోయింది అనసూయ.

కాత్యాయిని అంతేనా అన్నయ్యా ..అన్నట్లు చూసింది.ప్రకాష్ సిగ్గుతో తలదించుకున్నాడు.

“అన్నయ్యా !వదినా!

మీ అంతస్తుకు తగినదానినికాదని తెలిసీ అనవసరంగా వాదించాను.

అసలు విషయానికి వస్తాను.ఈ నెల యిరవై మూడున అవికపెళ్ళి..మీ మేనకోడలు మీకు పెళ్లిబట్టలకని ఈ యాభై వేలు

పంపించింది.     అమ్మాయితో బాటు అబ్బాయికూడా గూగుల్ కంపెనీ లోనే ఎంప్లాయి.

ఇద్దరి     శాలరీ కలిపి రెండు లక్షల పైమాటే. పెళ్లి కాగానే యిద్దరూ     కంపెనీ తరఫున స్టేట్స్ కు వెళ్ళిపోతారు. మీరు తప్పకుండా వచ్చి వధూవరులను ఆశిర్వదించండి."

భార్యా భర్తలు తెల్ల ముఖాలతో నోరు తెరిచేశారు.

"మీతో యింత సేపు ఎందుకు గొడవపడ్డానో తెలుసా?

ఒక్కసారి ఈ విడియో చూడండి."

*****

"అమ్మా!నేను ప్రేమించిన అబ్బాయి మాకంపెనీలోనే నాతోబాటే పనిచేస్తాడు.

మా యిద్దరి కులాలు వేరుకాని ..మతం మానవత్వం ఒక్కటే.

పుట్టింది విజయవాడ..ఉండేది భాగ్యనగరం.కట్నాలమీద     ఆశలేదు. అయినా ఈకాలంలో అబ్బాయిలకు కట్నాలిచ్చి పెళ్లి చేసుకునే అమ్మాయిలున్నారా ?"

"కాదనను..అవికా !మా అన్నయ్య కొడుకు రాజా వున్నాడు.మా అన్నయ్య నామాట కాదనడు.

అయిన సంబంధం ఆలోచించు.కట్నాలకు ఆశపడే స్వభావం కాదు మా అన్నయ్యది ."

“అమ్మా!మీ అన్నయ్య వెనుక మీ వదిన ఉంటుందని మర్చిపోయావా?

ప్రతి మగవాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందంటే నమ్మనుగాక నమ్మను.

కాని పతనమైన ప్రతి మగాడి వెనుకా స్త్రీ ఖచ్చితంగా ఉంటుందంటే నమ్ముతాను.”

“అనసూయ వదిన అన్నయ్య మాటను కాదనదు.అప్పుడంటే మనం పేదవాళ్ళం.

యిప్పుడు నీ మూలంగా మనం కూడా మంచి జీవితంలోకి అడుగుపెట్టాము.”

“అమ్మా!మానవ సంబంధాల మీద నీకంత నమ్మకముంటే ఒకసారి వెళ్ళి .. నా జాబ్ ..శాలరీ గురించి చెప్పకుండా అడిగిచూడు.వాళ్ళు సరేనంటే నా ప్రేమను నీకోసం వదులుకుంటాను.

నాకు తెలుసు..మనీ ముందు మమతలూ బంధుత్వాలూ బలాదూరని. నీది పిచ్చి నమ్మకమని నేనెందుకు వాదించాలి?నువ్వే కళ్ళారా చూడు ..

నువ్వు మీ అన్నావదినలతో మాట్లాడేటప్పుడు ఈ ఫోన్ ఆన్ చేసి ఉంచు.

నేను లైవ్ లో చూసి తరిస్తాను.”


“అవికా చెప్పిన కధ ..స్క్రీన్ ప్లే తో సహా సరిపోయింది.మీ యిద్దరి సూపర్ యాక్షన్ డైలాగులతో ఈ ఫోన్ తీసిన సినిమా మొత్తం చూసేసింది. నేను దానికి నాముఖం ఎలా చూపించాలో అర్ధమై చావడం లేదు.కన్నకూతురే కాబట్టి ముద్దులుపెట్టి మాయచేస్తాను.

అబ్బాయిది యీవూరే. కల్యాణవేదిక హైటెక్ సిటీ సైబర్ సిటీ కన్వెన్షన్ హాల్.

పెళ్లి రోజున యిదే డ్రైవర్ తో కార్ పంపిస్తాను.వస్తే సంతోషిస్తాము నేనూ..నాకూతురు అవిక."

హేండ్ బ్యాగ్ నుండి శుభలేఖ తీసి అన్నయ్యా వదినల చేతుల్లో పెట్టి అనసూయకు బొట్టు పెట్టి ..వెండి కుంకుమ భరిణ వదిన చేతుల్లో పెట్టి బయట పార్క్ చేసున్న వెర్నా కార్ వైపుకు హుందాగా అడుగులేసింది ..కాత్యాయిని .

ఇవాంకా టూర్ కోసం మాధాపూర్ రోడ్ల కు చేసిన అలంకరణ చూసి ముఖం మాడ్చుకుని యేడ్చేస్తున్న సిటీ రోడ్లలా నిలబడిపోయారు మిస్టర్ అండ్ మిసెస్ అసూయా పురుషోత్తం.సారీ.. సారీ..అనసూయా పురుషోత్తం.




చాలా రోజుల తరువాత రచయిత రఘురాంకు నిన్నటి రాత్రి కలొకటి వస్తే దాన్నే కథా వస్తువుగా చేసుకొని చక్కటి కథనొకటి రాయాలనుకొని ఉదయం పదిగంటలకల్లా అన్ని పనులను ముగించుకొని తన గదిలోకి వెళ్ళి తలుపేసుకొని గడియపెట్టుకొన్నాడు.ప్యాడ్ పెన్ను తీసుకొని చకచక రాయను మొదలెట్టాడు భోజనాల వేళకు కథను పూర్తిచేయాలన్న వుద్దేశ్యంతో. కారణం రోజూ తన శ్రీమతి తనకు 'టీ'ఇచ్చే సమయానికి వచ్చి 'టీ' తాగడమే కాక చెత్త కబుర్లలోకి దింపి సెల్ఫ్ డబ్బా వాయించుకొంటూ కథను రాయకుండా చేస్తూ మెదడును తినే మిత్రుడు మహానందం వస్తాడన్న భయంతో.

మహానందం,రఘురాంలు సమవయస్కులు. ఇద్దరూ మూడు నెలల తేడాతో పదవి విరమణ పొందారు. వారిరువురిలో మహానందం చాలా తెలివైన వాడు.ఘటికుడు.తిమ్మిని బమ్మిని చేసే రకం. అందుకే చాలా తెలివిగా తన వ్యాపకంకోసం ఓ తెలుగు సంస్థను స్థాపించి తెలుగు భాషా సేవలో మునిగి తేలుతూ విస్తారంగా మీడియా,పత్రికా,రాజకీయనాయకుల మధ్య పలుకుబడిని పెంచుకొని సభలు,సన్మానాలంటూ జరుపుతూ వాటి ద్వారా కాస్తో కూస్తో సొమ్ము చేసుకొంటూ కొనసాగు తున్నాడు.

స్నేహితుడితో పోటీ పడలేక పోయినా తనకున్న రవ్వంత జ్ఞానంతో లోకాన్ని చదివినందున తనకు చేతనైన రచనలు చేస్తూ సమయాన్ని గడుపుకోవాలని నిర్ణయించుకున్నాడు రఘురాం.అందుకే పదవి విరమణ పొందిన ఆరునెల్ల తరువాత తనూ రచనలు చేయడం ప్రారంభించాడు.

రఘురాంకు వెంట వెంటనే జోరీగల్లా కథకు సంబంధించిన ఆలోచనలు,అందుకు తగ్గ పదాలు సుళ్ళు తిరుగుతూ కళ్ళ ముందు కనబడుతుంటే వాటిని అలాగే పేపరు మీద పెట్టేస్తున్నాడు .

అంతలో కాలింగ్ బెల్లు మోగింది.కథకు అంతరాయం కలిగినందుకు కోపం,విసుగును ముఖానికి పులుముకొని వెళ్ళి తలుపు తీశాడు బహుశా వచ్చింది మహానందమేననుకొంటూ.అవును. వచ్చింది మహానందమే!

ఇక లాభం లేదనుకొన్న రఘురాం ముఖ కవలికలను వెంటనే మార్చుకొని పెదాలపైకి నవ్వు తెచ్చి పెట్టుకొని

"రారా...కూర్చో!నిజంగా ఇవాళ నువ్వు ఎక్కడ రాకుండా పోతావో.... మీ చెల్లెమ్మ పుట్టిన రోజు సందర్భంగా తను చేసుంచిన గారెలు పాయాసం వేస్టయి పోతుందోనని తెగ ఫీలవుతూ కూర్చున్నాను!ఎలాగో కరక్టు టైంకు వచ్చావ్ " అని మనసులోనే మహానందాన్ని తిట్టుకొంటూ" ఏమేవ్ !మీ అన్నయ్య వచ్చాడు"అని కిచ్చన్ లోకి వినిపించేలా హెచ్చరికగా కేకేశాడు.

సోఫాలో కూర్చొన్నాడు మహానందం.రివాల్వింగ్ చెయిర్లో కూర్చొన్నాడు రఘురాం ఇక కథ రాయడం కొనసాగించలేడన్న నిర్ణయానికొచ్చి.

"ఏరా కథ రాస్తున్నావులా వుంది?"అడగాలని అడిగాడు మహానందం.

"అవునురా!నువ్వేమో ఎంచక్కా నీ వ్యాపకం కోసం మాతృభాష, భాషాభివృద్ధంటూ ఓ సంస్థను నెలకొల్పి,మీడియా మిత్రులలతో పత్రికా సంపాదకులతో,రాజకీయనాయకులలతో పరిచయాలు పెంచుకొని సిటీలో గొప్పగా చలామణి అవుతున్నావ్ !అలాంటివేమీ చేతగాని నేను ఇల్లు,పిల్లలు,ఉద్యోగమంటూ ఇన్నాళ్ళు ఏగాను.అందుకే ఎప్పుడో ఓ నాలుగు కథలను రాసి నేనూ రచయితనేననిపించుకొన్న అనుభవంతో మళ్ళీ కలం పట్టుకున్నాను. ఇదేగా నాకున్న ఏకైక వ్యాపకం. టైం పాసవ్వాలిగా!?"అని నవ్వాడు రఘురాం.

"అది నిజమే!అయితే గోడక్కొట్టిన బంతిలా నువ్వు రాసే ప్రతికథ తిరిగి రావడం చూస్తున్నానురా! అవి తిరిగి రాకుండా అచ్చయ్యేలా చూసుకో!.అదే నీ సామర్థ్యం..ఆఁ"

"అచ్చవుతాయిలేరా !ఏదో ఒకరోజు ఏదేని పత్రికవాడు నా కథను వేస్తాడన్న నమ్మకంతోనే రాస్తున్నాను".

"నాకైతే ఆ నమ్మకం లేదన్నయ్యగారూ!శుభ్రంగా ఏ మార్వాడి కొట్లోనో రసీదులు రాసే పనికి వెళ్ళినా పది వేలు వస్తాయి.వింటేనా మరి. వీరు ఏదో ఒకటి చెయ్యాలి.లేకపోతే వాకింగ్ కనీ పార్కుకు వెళ్ళినా, పుస్తక పఠనమని గ్రంథాలయానికెళ్ళినా, కూరలు తేవడానికి బజారుకెళ్ళినా ఏవో తగాదాలు తెస్తారేమోనని భయం నాకు" అంటూ వేడి వేడి గారెలున్న ప్లేట్లను ,రెండు పెద్దగ్లాసులలతో పాయాసాన్ని తెచ్చి టీపాయి మీదుంచింది రఘురాం భార్య కనకరత్నం.

" మొదటిగా నీకు పుట్టిన రోజు శుభాకాంక్షలమ్మా! పోనీ...నువ్వేమిటి వాణ్ణి అంతమాటన్నావ్ !వాడెవడో అన్నట్టు ఇంత బ్రతుకు బ్రతికిన వాడ్ని మార్వాడి కొట్లో రసీదులు రాయమంటే ఎలా?అది కుదరదులే ! కథలనే రాసుకోనివ్వు.నువ్వు రాసుకోరా!"అంటూ వేడి గారెను విరిచి నోట్లో పెట్టుకొన్నాడు.

"అదికాదురా! అన్నాచెల్లి ఒక్కటై అలా దెప్పేయక పోతే బోలెడు మంది పత్రిక వాళ్ళనూ, కవులను, రచయితలను,రాజకీయనాయకులను పిలిపించి సభలు సన్మానాలంటూ జరుపుతూ వాళ్ళను గౌరవిస్తూ అందరికి దగ్గరయ్యానంటావ్ !నువ్వు తలచుకొంటే ఏలాంటి పనినైనా వాళ్ళ చేత చేయించగలనంటావ్! అంతటి వాడివి ఆ పత్రిక వాళ్ళకు చెప్పి నా కథలను ప్రచురింపజేసే ప్రయత్నం చేయకూడదూ!?"అన్నాడు

"అంటే...నా రికమండేషన్ కావాలంటావ్ ,నువ్వడగందే! చెప్పు...ప్రముఖ 'ఖ్యాతి' పత్రిక ఎడిటర్ రాంకు చెప్పాలా,'దివ్య' పత్రిక ఎడిటర్ జికెకు చెప్పాలా లేక ',జన్మ భూమి' పత్రిక ఎడిటర్ లక్ష్మి రాజ్యానికి చెప్పాల్నా!? వీళ్ళందరూ నా ఫ్రెండ్స్.అప్పుడప్పుడు మనింటికి వచ్చి వెళ్ళే వారే!నేను గీసే గీతను దాటరు సుమా!ఒక్కమాట చెప్పాననుకో మరుసటి వారమే నీ కథ వాళ్ళ పత్రికలో వస్తుంది"అంటూ పాయాసాన్ని చేతికందుకొని జుర్రు శబ్దం చేస్తూ తాగను ప్రారంభించాడు.

"ఏదోలే అన్నయ్యా!వాళ్ళతో చెప్పి ఏదో ఒక పత్రికలో వారి కథను వేయించండి పాపం!వారిని చూస్తుంటే జాలేస్తుంది నాకు"

"ఓకేమ్మా!నువ్వు అడిగావు కనుక చేసి పెడతాను.అసలు...నిన్నే జన్మ భూమి పత్రిక ఎడిటర్ లక్ష్మీరాజ్యం మా ఇంటికొచ్చి వెళ్ళింది.ఈ సంగతి ముందే తెలిసుంటే ఆవిడతో ఓ మాట చెప్పి ఈ పాటికి వేయించేవాడిని. పోనీ...ఇప్పుడు చెపుతానులే!"

"ఏమిట్రా! నువ్వంటుంది నిజమా?ప్రముఖ పత్రిక ఎడిటర్ లక్ష్మీరాజ్యంగారు మీ ఇంటికొచ్చారా?"ఆశ్చర్యాన్ని కనుబరచాడు రఘురాం.

"అవునురా!పెద్దాలందరికీ అయ్యగారి దయకావాలి మరి. అందుకే ఆవిడగారు మా ఇంటికొచ్చారు.ఈ సంవత్సరం మా సంస్థ జరిపే ఉగాది వేడుకల్లో ఆమెను గొప్పగా సన్మానించి,గౌరవించమని బ్రతిమాలింది. పోనీలే పాపమని ఒప్పుకున్నాను!"

"నిజమా! నాకు ఆశ్చర్యమేరా!కారణం ఓరోజు నా కథ ఎంపిక నిమిత్తం మాట్లాడాలని నన్ను పత్రికాఫీసుకు రమ్మంటే వెళ్ళాను. కొన్ని గంటలు వైట్ చేసిన తరువాత సాయంత్రానికి ఆమెను కలుసుకునే భాగ్యం కలిగింది నాకు.చాలా మంచి వ్యక్తి.నన్ను కొన్ని వివరాలడిగి తెలుసుకొని వెళ్ళమంది.బహుశా నా కథను ప్రచురణకు తీసుకొంటుందని నా నమ్మకం.ఆలాంటావిడ మీ ఇంటికొచ్చిందంటే అది నాకూ ఆశ్చర్యంతో కూడికొన్న గర్వకారణమే!"అన్నాడు గర్వంగా ఫీలవుతూ రఘురాం.

నవ్వాడు మహానందం.వెంటనే జేబులో నుంచి ఫోన్ తీశాడు..ఏదో ఎవరితోనో మాట్లాడాడు."ఓకే...ఓకే..."అని ఫోన్ కట్ చేసి నీళ్ళు తాగి"ఓకేరా నీ కథ మరో రెండు వారాల్లో పత్రికలో వస్తుంది. చాలా!"అన్నాడు.

ఎగిరి గెంతేశాడు రఘురాం.గట్టిగా స్నేహితుణ్ణి ముద్దు పెట్టుకొని "థాంక్సురా! ఏ పత్రికలో వస్తుందిరా?నువ్వు ఎవరితో మాట్లాడావో చెప్పవూ?సంతోషంతో పూవల్లే విచ్చుకున్న ముఖంతో అడిగాడు.

"ఇంకెవరూ...ఆ లక్ష్మీరాజ్యంతోనే!వాళ్ళ పత్రికే వున్న వాటిల్లో నంబరు ఒన్ !అందులోనే వస్తుంది,చాలా?"

""చాలా థాంక్సురా!నిజంగా పెద్దలతో నీకున్న పరపతికి హేట్స్ అప్ !" అన్నాడు.మళ్ళీ కథ రాయడంలో నిమగ్నమైయ్యాడు రఘురాం.రఘురాంను ఇక డిస్టర్బ్ చేయకూడదనుకొన్న మహానందం లేచి వెళ్ళి డైనింగ్ టేబుల్ చెయిర్ లో కూర్చొని కిచ్చన్ లో పని చేసుకొంటున్న కనకరత్నంతో పిచ్చా పాటి మాట్లాడుతున్నాడు.

అప్పుడు వున్నట్టుండి ఓ కారొచ్చి ఇంటి ముందాగింది.కారులోనుంచి ఒకావిడ దిగింది.

ఆమెను చూసిన రఘురాం షాక్ తిన్నాడు.ఎదరే వెళ్ళి"రండి మేడం .నా ఇంటికి మీరు రావడం నా అదృష్టం.రండి.కూర్చోండి"అని సోఫాను చూపాడు.అప్పుడు రఘురాం తాపత్రయాన్ని,వచ్చినావిడ హుందాతనాన్ని గమనించిన మహానందం మళ్ళీ కనకరత్నంతో మాట్లాడ్డంలో నిమగ్నమైయ్యాడు.

"ఈ వీధి చివర మా బంధువులబ్బాయికి నిశ్చితార్థం అయితే వచ్చాను.మీరిక్కడే వున్నారు కనుక మీకు స్వీటు న్యూసును చేరవేద్దామని దిగాను.మీ కథను తీసుకున్నాం రఘురాంగారూ!వచ్చే ఇస్సులో వస్తుంది. చూసుకొండి"అంటూ వెళ్ళి కారులో కూర్చొంది.

"ధన్యవాదాలు మేడం "అన్నాడు ఆవిడ వెంట కారు వరకూ వెళ్ళి డోరు మూస్తూ. కారు కదిలింది.

అక్కడే నిలబడి కారు కనుమరుగైయ్యేంత వరకూ చూస్తూ నిలబడ్డ రఘురాంకు రకరకాలైన ఆలోచనలు మెదడులో కొట్టాడు తుంటే లోనికెళ్ళి డైనింగ్ చెయిర్ లో కూర్చొని వున్న స్నేహితుడు మహానందం వంక చూశాడు'ఏమిటి వీడు లక్ష్మి రాజ్యంతో మాట్లాడకుండా నిర్లక్షంగా వుండి పోయా'డనుకొంటూ.

మహానందం అక్కణ్ణుంచి లేసొచ్చి సోఫాలో కూర్చొని "ఎవర్రా ఆవిడ!నువ్వేంటి అంత వినయంగా చేతులు కట్టుకొని కారు వరకూ వెళ్ళి పంపించి మరీ వస్తున్నావ్ ?అడిగాడు .

షాక్ తిన్నాడు రఘురాం.అంటే ఎడిటర్ లక్ష్మి రాజ్యం ఎవరన్నది మహానందంకు తెలియదన్న మాట. ఒక్క లక్ష్మిరాజ్యమే కాదు తనతో రోజూ ప్రస్తావిస్తున్న గొప్పవాళ్ళెవరూ మహానందంకు తెలియదేమోనను కొన్నాడు.తన గొప్పలకోసం అలా రోజూ తనతో అబద్దాలాడుతున్నాడన్న నిర్ణయానికొచ్చాడు రఘురాం. "అయితే ఆవిడెవరో నీకు తెలీదా?" అడిగాడు మహానందం ముఖంలోకి చూస్తూ రఘురాం.

"నాకెలా తెలుస్తుందిరా పరిచయం లేకుండా?"సాధారణంగా చెప్పాడు మహానందం.

"అవునా!మరిందాక నా కథా ప్రచురణ గురించి మాట్లాడిందెవరితో....!"

"ఆవిడ...ఆవిడ...ఆవిడేరా..లక్ష్మీరాజ్యం"తడబాటుతో వచ్చాయా మాటలు మహానందం నోటినుంచి.

"ఇప్పుడొచ్చిందెవరో తెలుసా.. లక్ష్మి రాజ్యంగారే! వారేరా మాతృభూమి ఎడిటర్ .ఈ వీధి చివరున్న వాళ్ళ బంధువుల ఇంటికెళుతూ వచ్చేవారం వాళ్ళ పత్రికలో నా కథ వస్తుందని ఆ తీపి కబురు నాతో చెప్పటానికి ఇక్కడ దిగారు"అంటూ మహానందం ముఖంలోకి మళ్ళీ చూశాడు రఘురాం.

ఇక ఏమీ మాట్లాడలేక పోయాడు మహానందం.తను కావలసినన్ని అబద్ధపు ప్రచారాలతో అందరిని మభ్య పెడుతూ, నమ్మిస్తూ,ఆర్థికంగా లాభ పడుతున్న సంగతి తన స్నేహితుడికి తెలిసి పోయిందని యిట్టే గ్రహించాడు. మారు మాట లేకుండా ముఖం తప్పించుకొని "సాయంత్రం ఓ సాహిత్య సభకు కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలిరా. వస్తాను!"అంటూ చకచకా మూడు మెట్లు దిగి తిరిగి చూడ కుండా వెళ్ళిపోయాడు మహానందం.మరి రేపు 'టీ'సమయానికి వస్తాడో రాడో !